# విశాల భారతి

తెలుగు దినపత్రిక

09-06-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 155


## మోదీ ఏం చేశారో? నేనేం చేశానో చర్చకు సిద్ధం



- అభివృద్ధిని అడ్డుకుంటున్న కేంద్ర, ప్రతిపక్షాలపై సీఎం ఆగ్రహం
- మెరుగైన పాలన కోసం హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజన
- మెట్రో విస్తరణ, అంతర్జాతీయ బస్ టెర్మినల్ నిర్మాణ ప్రకటన
- పాలనపై చర్చకు రావాలని ప్రతిపక్షాలకు సవాల్
- కబ్జా భూముల్లో లక్ష ఇళ్ల నిర్మాణం చేపడతామని భరోసా
- రాబోయే రెండేళ్లు సంక్షేమమే లక్ష్యంగా పాలన

02



# ఓం భీం బుష్..!

## చేప ప్రసాదం వ్యాధిని నయం చేస్తుందనడానికి ఆధారాలు లేవు

- ఇది కేవలం ప్లేసిబో ఎఫెక్ట్ నమ్మకం మాత్రమే
- దీనిని 'మందు' అనకూడదని కోర్టులు స్పష్టం చేశాయి
- దీని కోసం ప్రభుత్వ నిధులు ఖర్చు చేయడం అశాస్త్రీయం
- చేప పిల్లలను మింగడం వల్ల ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది
- మూఢనమ్మకాలు వదిలి ఆధునిక వైద్యం ఆశ్రయించాలి

### హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపుగా చేప ప్రసాదం

ప్రపంచంలో ఎక్కడా కనిపించని ప్రత్యేక సంప్రదాయంగా చేప ప్రసాదం కార్యక్రమం హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెడుతోంది. ఒకవైపు విశ్వాసం, మరోవైపు భారీ ప్రజా నిర్వహణ సామర్థ్యానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. ప్రతి ఏడాది లక్షల మంది తరలివస్తుండటంతో ఇది కేవలం వైద్య విశ్వాస కార్యక్రమంగా కాకుండా సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక కోణాల్లోనూ ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఈ ఏడాది కూడా లక్షలాది మంది ఉబ్బసం బాధితులు ఆశతో, నమ్మకంతో చేప ప్రసాదం కోసం తరలిరావడం, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారడం ఈ సంప్రదాయం ప్రజల్లో ఎంతగా వేళ్లూనుకుపోయిందో స్పష్టం అవుతోంది.



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రకృతిలో జరిగే అద్భుతమైన మార్పులకు, మానవ సమాజంలో పాతుకుపోయిన ప్రాచీన నమ్మకాలకు మధ్య జరిగే సంఘర్షణలో మృగశిర కార్తె ఒక ప్రధాన ఘట్టంగా నిలుస్తుంది. ప్రతి ఏటా జూన్ నెలలో ఈ కాలం రాగానే, హైదరాబాద్ నగరం కేంద్రంగా ఒక వింతైన చర్చ మొదలవుతుంది. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వేదికగా బత్తిని కుటుంబం పంపిణీ చేసే ఈ చేప ప్రసాదం కార్యక్రమం వెనుక దశాబ్దాల చరిత్ర ఉన్నప్పటికీ, దీనిని ఆధునిక విజ్ఞాన శాస్త్రం ఏ కోణంలోనూ అంగీకరించడం లేదు. ఒకవైపు తరతరాలుగా వస్తున్న విశ్వాసం ప్రజలను అక్కడికి పరుగులు తీయిస్తుంటే, మరోవైపు శాస్త్రీయ దృక్పథం కలిగిన మేధావులు, హేతువాదులు దీనిని మూఢనమ్మకంగా పరిగణిస్తూ ప్రశ్నిస్తున్నారు. ఆధునిక వైద్యశాస్త్రం ఊపిరితిత్తుల వ్యాధులకు చికిత్స అందించడానికి ఎంతో పురోగమించినప్పటికీ, ప్రజలు ఇప్పటికీ ఇటువంటి అశాస్త్రీయ పద్ధతుల వైపు మొగ్గు చూపడం మిగతా 3లో..

## సిరిసిల్లలో ఇసుక భూతం!

- అక్రమ తవ్వకాలతో 700 కొండలు మాయం
- సిరిసిల్ల ఇసుక, గ్రానైట్ అక్రమాలపై విచారణ ముమ్మరం
- నిబంధనలు దాటి ఇసుక తరలిస్తూ వందల కోట్ల ఎగవేత
- మాజీ మంత్రులు, కీలక నేతల హస్తంపై ఫోకస్
- రూ. 750 కోట్ల పన్ను ఎగవేతపై సీఐడీ విచారణ
- మళ్లీ చర్చలోకి నేరెళ్ల ఉదంతం, కేటీఆర్ ఇమేజ్‌పై ప్రభావం




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగిన మానేరు ఇసుక దందా వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారుతోంది. గత పాలకుల కనుసన్నల్లో యధేచ్ఛగా సాగిన ఈ మైనింగ్ అక్రమాలపై ప్రస్తుత ప్రభుత్వ అధికార యంత్రాంగం దర్యాప్తును వేగవంతం చేసింది. కేవలం ఇసుక మాఫియా మాత్రమే కాకుండా కరీంనగర్ కేంద్రంగా జరిగిన గ్రానైట్ అక్రమాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించింది. ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ చేపట్టడంతో స్థానిక రాజకీయ నేతల్లో తీవ్ర అలజడి మొదలైంది. ఏళ్ల తరబడి చక్రం తిప్పిన కీలక నేతల గుండెల్లో ఈ విచారణ రైళ్లు పరిగెత్తిస్తోంది. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టి వందల కోట్ల రూపాయల ఇసుక దోపిడీకి పాల్పడినట్లు మైనింగ్ శాఖ క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైంది. రాయల్టీ, జీఎస్టీ, సీనరేజ్ ఫీజుల రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని భారీగా ఎగవేసినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అక్రమ దందాలో భాగంగా ప్రతిరోజూ సుమారు 800 టిప్పర్ల ఇసుకను హైదరాబాద్, బెంగళూరు మార్కెట్లకు తరలించినట్లు తెలుస్తోంది. ఈ భారీ రవాణా వెనుక పెద్ద ఎత్తున ఆర్థిక నేరాలు దాగి ఉన్నాయని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ కొంతమంది వ్యక్తులు అడ్డగోలుగా సంపాదించిన తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రవాణా సాఫీగా సాగేందుకు నకిలీ వేబిల్లులను సృష్టించి అధికారులను బురిడీ మిగతా 4లో..

## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

- ద్రవ లోహంపై పడి 8 మంది మృతి, 7 మందికి తీవ్ర గాయాలు
- క్రేన్ హుక్స్ విఫలమవ్వడం ప్రమాదానికి ప్రధాన కారణం
- సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు
- హోంమంత్రి అనిత స్వయంగా పర్యవేక్షిస్తున్నారు
- లాగ్ బుక్స్, సెన్సార్ రికార్డుల ఆధారంగా విచారణ ప్రారంభమైంది
- భద్రతా ప్రమాణాల పాటించడంలో యాజమాన్యంపై విమర్శలు

02

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో సోమవారం సంభవించిన ఘోర ప్రమాదం పారిశ్రామిక భద్రతపై తీవ్ర ప్రశ్నలను లేవనెత్తుతోంది. స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2 విభాగంలో మోల్టెన్ మెటల్ ల్యాడల్ నుంచి బకెట్లు అకస్మాత్తుగా కుప్పకూలడం వల్ల ఎనిమిది మంది కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఏడుగురు కార్మికులు తీవ్ర గాయాలతో స్టీల్ ప్లాంట్ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నారు.



## కారుకు పది సీట్లు రావు

- బీఆర్ఎస్ పగటి కలలు మానాలి
- పదేళ్ల అహంకారానికి ప్రజలు బుద్ధి చెప్పారు
- గతంలో ధరలు పెంచింది బీఆర్ఎస్ నేతలే
- కేసీఆర్ హయాంలో పోలీసులకు ఆత్మగౌరవం లేదు
- అలవెన్సుల రద్దు అనేది అభూతకల్పన
- అధికారులను బెదిరించడం మాజీ మంత్రిగా పద్ధతి కాదు

02





## మరో వివాదంలో బండి సంజయ్

- ఈటలపై వాల్ పోస్టర్ల ఘటన బీజేపీలో కలకలం రేపింది
- బండి అనుచరుడు రామకృష్ణపై కేసు నమోదైంది
- పదవుల విషయంలో నేతల మధ్య విభేదాలే ప్రధాన కారణం
- తన పదవిని ఈటల వేరొకరికి ఇప్పించడంతో కక్ష కట్టారు
- రామకృష్ణను అరెస్టు చేసే అవకాశం ఉంది
- పలు వివాదాల నడుమ 3 రోజులుగా ఫోన్ స్విచాఫ్‌లో ఉంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే కమలం పార్టీలో ఇప్పుడు పరిస్థితి పూర్తిగా గాడి తప్పినట్లు కనిపిస్తోంది. అంతర్గత కుమ్ములాటలు పతాక స్థాయికి చేరి బజారున పడుతున్నాయి. నాయకుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణం నెలకొంది. ఒకరిని చూసి మరొకరు ఏమాత్రం సహించుకోలేని స్థాయిలో శత్రుత్వం పెరిగిపోయింది. ఈ విభేధాలు ఇప్పుడు పోస్టర్ల రూపంలో రచ్చకెక్కాయి. మిగతా 2లో..

## రేవంత్ హిట్లరే కాదు.. తాలిబన్ కూడా



- సీఎం రేవంత్‌ది హిట్లర్, తాలిబన్ల తరహా వ్యవహార శైలి
- 27 వేల ప్రభుత్వ బడులను 4 వేలకు తగ్గించే కుట్ర
- ఇంటర్ విద్యపై సీఎంకు, అధికారులకు మధ్య సమన్వయం లేదు
- వర్సిటీల కనీస ఆమోదం లేకుండానే 'దోస్త్' ప్రవేశాలు
- గురుకులాల్లో 100 మంది చనిపోయినా సీఎంకు పట్టింపు లేదు
- ఫీజు బకాయిలు ఎగ్గొట్టేందుకు తెచ్చిన 'జీవో 7'ను వెంటనే రద్దు చేయాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియంతృత్వ పోకడలపై భారత రాష్ట్ర సమితి నాయకురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన వ్యవహార శైలి కేవలం హిట్లర్ లాగా మాత్రమే కాకుండా ఒక తాలిబన్ తరహాలో ఉందని అత్యంత ఘాటుగా విమర్శించారు. పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు ముఖ్యంగా ఆడపిల్లలకు ఉన్నతమైన చదువులను మిగతా 3లో..

## రాష్ట్రాన్ని పలకరించిన నైరుతి

- తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి
- జూన్ 18 నాటికి రాష్ట్రమంతటా విస్తరించనున్నాయి
- జూన్ 11-12 నుంచి నగరంలో ప్రభావం చూపుతాయి
- దక్షిణ జిల్లాల్లో భారీ వర్ష సూచన ఉంది
- గంటకు 40-50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయి
- రుతుపవనాల రాకతో ఖరీఫ్ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు

02



## లక్ష కోట్లు దాటిన హైడ్రా వేట




- రెండేళ్లలో రూ. 1.10 లక్షల కోట్ల ప్రభుత్వ భూముల స్వాధీనం
- వచ్చే ఏడాది నాటికి రూ. 2 లక్షల కోట్లకు చేరనుంది
- చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల సంరక్షణ
- కోకాపేట, నార్సింగి వంటి చోట్ల వేల కోట్ల భూముల రక్షణ

03

# రాష్ట్రాన్ని పలకరించిన నైరుతి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ గడ్డపైకి నైరుతి రుతుపవనాలు కదలివచ్చాయి. భానుడి భగభగలతో అల్లాడిపోయిన తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఈ కబురు ఎంతో ఉపశమనాన్ని ఇస్తోంది. ఈ నెల 4న కేరళ తీరాన్ని తాకిన రుతుపవనాలు, దక్షిణ భారత రాష్ట్రాల మీదుగా ప్రయాణిస్తూ కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలను దాటాయి. అరేబియా సముద్రం నుంచి వీస్తున్న గాలులు అనుకూలించడంతో, ఇవి వేగంగా ముందుకు సాగి తెలంగాణ గడపను తాకాయి. సుదీర్ఘ వేసవి కాలం ముగిసి, వర్షర్తువు ఆరంభం కావడంతో రైతన్నల ముఖాల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. వ్యవసాయ పనులకు సమయం ఆసన్నమైందని భావిస్తున్న తరుణంలో ఈ ప్రకటన రావడం రాష్ట్రానికి శుభసూచకం. వాతావరణ పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్న హైదరాబాద్ వాతావరణ కేంద్రం, కీలక అంచనాలను వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని దక్షిణ ప్రాంతాలకు విస్తరించిన ఈ పవనాలు, రాబోయే 48 నుంచి 72 గంటల వ్యవధిలో రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాలకు వ్యాపించనున్నాయి. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ నగర పరిధిలో జూన్ 11 నుండి 12 తేదీల మధ్య రుతుపవనాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. నగరవాసులు ఎండ వేడిమి నుంచి త్వరలోనే పూర్తిగా విముక్తి పొందనున్నారు. జూన్ 15 నుంచి 18 తేదీల మధ్యలో మధ్య, ఉత్తర తెలంగాణ జిల్లాలన్నింటికీ ఈ పవనాలు పూర్తిస్థాయిలో విస్తరిస్తాయి. తద్వారా రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కూడా వాతావరణం చల్లబడనుంది. రుతుపవనాల రాకతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షపాతం నమోదు కావడానికి అన్ని పరిస్థితులు అనుకూలంగా మారాయి. ఈ క్రమంలోనే రాబోయే సోమ, మంగళవారాల్లో వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ జిల్లాల్లో గరిష్టంగా 11 నుంచి 20 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. మిగిలిన జిల్లాల్లో 2 నుంచి 5 మిల్లీమీటర్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడవచ్చు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. గాలుల వేగం గంటకు



40 నుంచి 50 కిలోమీటర్ల మేర ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. బలమైన ఈదురుగాలులు వీచే సమయంలో చెట్ల కింద ఉండటం, పాత భవనాల సమీపంలో నిలబడటం సురక్షితం కాదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం ఉన్నందున విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని కోరుతున్నారు. గాలి వేగం పెరిగినప్పుడు ఇళ్లు, షెడ్ల పైకప్పులు ఎగిరిపోయే అవకాశం ఉన్నందున, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు అందుతున్నాయి. రైతులు తమ పశువుల విషయంలో కూడా తగిన జాగ్రత్తలు పాటించాలి. ఖరీఫ్ సీజన్‌కు అనుకూల పరిస్థితులు ఏర్పడుతుండటంతో రైతులు వ్యవసాయ పనుల కోసం సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 1.40 కోట్ల ఎకరాల సాగు విస్తీర్ణానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో, వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతాంగం విత్తనాలు కొనుగోలు చేసేందుకు దుకాణాలకు వెళ్తున్నారు. గతేడాది కంటే ఈసారి సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా. దాదాపు 95 నుంచి 100 శాతం సాధారణ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయి. సరైన సమయంలో వర్షాలు పడితే భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో భూగర్భ జలమట్టం సగటున 6 నుండి 8 మీటర్ల లోతులో ఉండగా, వర్షాల తర్వాత ఇది 3 మీటర్ల మేర పెరగవచ్చు. ఈ రుతుపవనాల ప్రభావం తెలంగాణ ఆర్థిక వ్యవస్థపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపనుంది. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో ప్రస్తుతం సుమారు 300 నుంచి 400 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, వర్షాల వల్ల శ్రీశైలం, నాగార్జున సాగర్, కరీంనగర్ లోని ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకోనున్నాయి.

# మోదీ ఏం చేశారో? నేనేం చేశానో చర్చకు సిద్ధం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మియాపూర్‌లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిపక్షాల తీరుపై నిప్పులు చెరిగారు. రాజధాని నగరాన్ని అంతర్జాతీయ స్థాయికి చేర్చే క్రమంలో తమ ప్రభుత్వం చేపడుతున్న పనులకు కేంద్రం నుంచి సహకారం అందడం లేదని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీ వెళ్తే కేంద్ర మంత్రులు సహకరించకుండా, ఇక్కడి ప్రతిపక్ష నాయకులు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. అభివృద్ధిని ఆపేందుకు కుట్రలు చేసే వారిని ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే రోజుల్లో వారికి తగిన శాస్తి తప్పదని స్పష్టం చేశారు. నగర ప్రజల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులతో హైదరాబాద్ రూపురేఖలను పూర్తిగా మార్చివేస్తామని భరోసా ఇచ్చారు. హైదరాబాద్ నగరాన్ని ఆరు ప్రధాన ఆర్థిక కేంద్రాల్లో ఒకటిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోంది. నగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌ను 3 కార్పొరేషన్లుగా విభజించినట్లు సీఎం వెల్లడించారు. ఢిల్లీలోని కాలుష్యం, ముంబైలోని వరదలు, బెంగళూరులోని ట్రాఫిక్ సమస్యలు ఇక్కడ రాకుండా ముందుచూపుతో పక్కా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. మెట్రో రైలు రెండో దశ విస్తరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టడమే కాకుండా, గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ బస్ టెర్మినల్ నిర్మించబోతున్నట్లు ప్రకటించారు. ఇటువంటి భారీ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే నగర రవాణా వ్యవస్థ పూర్తిగా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీరుపై ముఖ్యమంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎంపీలుగా గెలిచిన బీజేపీ నేతలు రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి రాజకీయ క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారని దుయ్యబట్టారు. కేంద్ర మంత్రిగా ఉండి ప్రధాని మోదీని తెలంగాణకు నిధులు ఇవ్వాలని ఎందుకు కోరడం లేదని రేవంత్ రెడ్డి నిలదీశారు. ప్రధాని సొంత రాష్ట్రంలోని సబర్మతి నదిని అభివృద్ధి చేసుకుంటే అభినందించే నాయకులు,



తాము మూసీ నదిని ప్రక్షాళన చేస్తామంటే ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. రాష్ట్ర అభివృద్ధికి రావలసిన నిధులను రాకుండా అడ్డుపడటం ద్వారా కేంద్రం తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య సాగుతున్న చీకటి ఒప్పందాలను ముఖ్యమంత్రి ఎండగట్టారు. తాను కేంద్ర మంత్రులను కలిసి నిధులు కోరితే, అవే మంత్రులను ప్రతిపక్ష నేతలు కలిసి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు నిరంతరం కాళ్లలో కట్టెలు పెడుతున్నాయని విమర్శించారు. కేసీఆర్, కిషన్ రెడ్డిల అహంకారపూరిత వైఖరిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని చెప్పారు. ఇదే తీరు కొనసాగితే రాబోయే రోజుల్లో వారికి పుట్టగతులు ఉండవని, ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఢిల్లీ మొహం చూడలేనంతగా ప్రజలు వారిని తిరస్కరిస్తారని జోస్యం చెప్పారు. పదేళ్ల కేసీఆర్ పాలన, పన్నెండు ఏళ్ల మోదీ పరిపాలన, కేవలం 30 నెలల తమ కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమని ముఖ్యమంత్రి సవాల్ విసిరారు. రాష్ట్రానికి ఎవరు ఎన్ని నిధులు తెచ్చారో, ఏ రంగంలో ఎలాంటి ప్రగతి సాధించామో తేల్చుకుందామని ప్రతిపక్షాలకు పిలుపునిచ్చారు. చర్చకు రాలేని వారు కేవలం విమర్శలకే పరిమితం కావడం వారి అసమర్థతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. తమ హయాంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించడమే కాకుండా, ఇందిరా మహిళా శక్తి ద్వారా 1000 మందికి పైగా మహిళలకు పెట్రోల్ బంకుల యాజమాన్య హక్కులు ఇచ్చామని గుర్తుచేశారు. అభివృద్ధి పనులకు సూచనలు చేయడం చేతగాని వారు కనీసం అడ్డుపడకుండా ఉంటే మంచిదని హితవు పలికారు. విద్యార్థుల ప్రగతి కోసం యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా విద్యను అందిస్తున్నామని సీఎం తెలిపారు. ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ఉదయం వేళ పౌష్టికాహారం అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. గతంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని, వాటిలో పేదల కోసం గృహ నిర్మాణాలను చేపడుతున్నామని వెల్లడించారు. త్వరలోనే లక్ష ఎల్ఐజీ, ఎమ్ఐజీ ఇళ్లను నిర్మించి నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తామని ప్రకటించారు. ఎక్కడికక్కడ పేదల కోసం ఇళ్లు నిర్మించడం ద్వారా నగరంలో వసతి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రాబోయే 24 నెలల కాలం ప్రభుత్వం కేవలం అభివృద్ధి, సంక్షేమంపైనే పూర్తి దృష్టి సారిస్తుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పగ ప్రతీకారాలకు తావులేకుండా రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తామని పేర్కొన్నారు. నగరంలో కబ్జాదారుల నుంచి భూములను విడిపించి వాటిని పేదల అభివృద్ధి కోసం వినియోగిస్తామని చెప్పారు. లక్షల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకోవడం ద్వారా సామాన్యులకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో జరిగిన అన్యాయాలను సరిదిద్దుతూ, రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రాజకీయాల కంటే ప్రజల సంక్షేమమే ముఖ్యమని తమ ప్రభుత్వం భావిస్తుందని స్పష్టం చేశారు. నగరంలో తలపెట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం చెప్పారు. మెట్రో రెండో దశ ప్రాజెక్టు ద్వారా 70 కిలోమీటర్ల మేర కొత్త మార్గాలను నిర్మించబోతున్నామని తెలిపారు. దీనివల్ల ప్రయాణికుల కష్టాలు తీరడమే కాకుండా, నగర రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందని వివరించారు. గాజులరామారంలో నిర్మించనున్న అంతర్జాతీయ బస్ టెర్మినల్ ద్వారా సుమారు 5000 మంది ప్రయాణికులకు ఒకేసారి రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టులతో పాటు నగరంలో వందల సంఖ్యలో చిన్న చిన్న పార్కులు, క్రీడా మైదానాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చడమే తమ సంకల్పమని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో పెద్దపీట వేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 50 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నామని లెక్కలు చెప్పారు. ప్రజా పాలనలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన 1 కోటి 25 లక్షల దరఖాస్తులను పరిష్కరించామని గుర్తుచేశారు. ఇప్పటివరకు 60 వేల మందికి పైగా నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని గణాంకాలు వివరించారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, పారదర్శకమైన పాలన అందిస్తున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 90 శాతం వరకు అమలు చేశామని, మిగిలిన వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. మొత్తంగా నగర ప్రజలందరూ ఏకతాటిపై నిలిచి నగరాభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. జెండాలు, ఎజెండాలు పక్కనపెట్టి నగర ప్రగతిని కాంక్షించాలని సూచించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగానే ప్రతి అడుగు ముందుకు వేస్తున్నామని తెలిపారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను పట్టించుకోకుండా, ప్రజల సంక్షేమం కోసం ముందుకు సాగుతామని పునరుద్ఘాటించారు. 2026 నాటికి నగర ముఖచిత్రం పూర్తిగా మారుతుందని, ప్రతి ఒక్కరికీ మెరుగైన వసతులు అందుతాయని భరోసా ఇచ్చారు. అభివృద్ధిలో ఎక్కడ రాజీ పడకుండా, సామాన్యుడి సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# మరో వివాదంలో బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి

మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా నగరంలో రాత్రికి రాత్రే వెలిసిన వాల్ పోస్టర్లు కమల దళంలో పెను సంచలనంగా మారాయి. పార్టీలోని క్రమశిక్షణ గీతను దాటి నేతలు బహిరంగ విమర్శలకు దిగడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై అధిష్ఠానం ఆగ్రహంతో ఉన్నట్లుగా సమాచారం అందుతోంది. ఈ వాల్ పోస్టర్ల వివాదం వెనుక సొంత పార్టీకి చెందిన అగ్ర నేతల హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రోద్బలంతోనే ఇదంతా జరుగుతోందని పార్టీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి బండి సంజయ్ ప్రధాన అనుచరుడిగా పేరొందిన జన్యావుల రామకృష్ణపై పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారు. విచారణ వేగవంతం చేసిన అధికారులు ఏ క్షణంలోనైనా ఆయనను అరెస్టు చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సొంత పార్టీ నేతలే ఇలా ఒకరిపై ఒకరు కుట్రలు చేసుకోవడం అధిష్ఠానానికి సైతం తలనొప్పిగా పరిణమించింది. నాయకుల మధ్య వర్గపోరు పార్టీ ప్రతిష్టను దారుణంగా దెబ్బతీస్తోంది. క్యాడర్ అయోమయానికి గురవుతున్నారు. రాజకీయాల్లో ఈటల రాజేందర్‌కు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వివాద రహితుడిగా అందరితో కలివిడిగా ఉండే అజాత శత్రువుగా ఆయనకు పేరుంది. గులాబీ పార్టీతో విభేదించి బయటకు వచ్చిన ఆయన 2021 సంవత్సరంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఆ తర్వాత 2021లో జరిగిన హుజూరాబాద్



ఉప ఎన్నికలో పోటీ చేసి తన సత్తా చాటారు. అధికార పార్టీ ప్రలోభాలకు గురిచేసినా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా 23855 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. అయితే అనూహ్యంగా 2023లో జరిగిన శాసనసభ సాధారణ ఎన్నికల్లో అదే హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగి 16873 ఓట్ల తేడాతో తీవ్ర నిరాశను ఎదుర్కొంటూ ఓటమి పాలయ్యారు. రాజకీయంగా కుంగిపోలేదు. శాసనసభ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన తన దృష్టిని పార్లమెంట్ ఎన్నికలపై కేంద్రీకరించారు. కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని ఈటల భావించారు. అయితే అదే స్థానం కోసం బండి సంజయ్ పట్టుబట్టడంతో ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో ప్రచ్ఛన్న యుద్ధం నడిచింది. అధిష్ఠానానికి వరుసగా ఫిర్యాదులు వెళ్లడంతో చివరికి ఈటల వెనక్కి తగ్గి మల్కాజిగిరి నుంచి పోటీ చేయాల్సి వచ్చింది. 2024 ఎన్నికల్లో ఏకంగా 3 లక్షలకు పైగా ఓట్ల భారీ మెజారిటీతో ఎంపీగా గెలుపొందారు. నిజానికి కరీంనగర్‌లో 2021 స్థానిక సంస్థల ఎన్నికల సమయం నుంచే ఈ ఇద్దరు అగ్ర నేతల మధ్య వైరుధ్యం అప్పుడే మెల్లగా ప్రారంభమై పెద్దదిగా కూడా మారింది. ఈ పాత వైరం 2025 సంవత్సరంలో మరింత తీవ్ర రూపం దాల్చింది. శామీర్‌పేటలోని తన సొంత గృహంలో ఈటల రాజేందర్ విలేకరులతో మాట్లాడుతూ బండి సంజయ్‌ను ఉద్దేశించి చేసిన సంచలన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపాయి. అసలు నువ్వెవరు నీ శక్తి ఎంత నేను 2002 సంవత్సరంలోనే ఈ జిల్లాకు వచ్చాను మంత్రిగా పని చేశాను అని ఈటల తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జిల్లాలో నేను అడుగుపెట్టని గ్రామం లేదు ఖబర్దార్ బిడ్డా అంటూ హెచ్చరించారు. ఈ ఘాటు వ్యాఖ్యలపై బండి సంజయ్ వర్గీయులు అప్పట్లో పార్టీ అధిష్ఠానానికి ఢిల్లీ స్థాయిలో పెద్ద ఎత్తున నేరుగా వెళ్లి కూడా గట్టిగానే ఫిర్యాదు చేశారు. ఇద్దరి మధ్య ఆధిపత్య పోరుకు మరిన్ని కారణాలు తోడయ్యాయి. రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవి కోసం ఈటల రాజేందర్ గట్టిగా ప్రయత్నించారు. ఆ పదవి ఆయనకు దక్కకుండా బండి సంజయ్ అడుగడుగునా అడ్డుపడ్డారని ఈటల వర్గం బలంగా నమ్ముతోంది. సిఎస్ఆర్ నిధుల వ్యవహారం చిచ్చు రగిల్చింది. ఈ ఫండ్స్‌ను కేవలం కిషన్ రెడ్డి బండి సంజయ్ మాత్రమే తమ సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారని మిగతా నేతలకు నయా పైసా రావడం లేదని కొన్నాళ్ల క్రితం ఈటల బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సంచలన వ్యాఖ్యలు అధికారికంగా పార్టీలోని అంతర్గత విభేదాలను పూర్తిగా ధ్రువీకరిస్తున్నాయి. కార్యకర్తల్లో కూడా ఎన్నో రకాల కొత్త అనుమానాలకు తావిస్తూ కలవరపెడుతున్నాయి. ఈటల రాజేందర్‌ను లక్ష్యంగా చేసుకుని వాల్ పోస్టర్లు వెలవడం ఇదే తొలిసారి ఏమీ కాదు. గత ఏప్రిల్ నెలలో కూడా ఆయనకు వ్యతిరేకంగా నగరంలో పలుచోట్ల ఇలాంటి పోస్టర్లు దర్శనమిచ్చాయి. ఆ సమయంలో ఈటల రాజేందర్ భారతీయ జనతా పార్టీని వీడి వెళ్లిపోతున్నారంటూ ప్రత్యర్థులు కావాలనే వాల్ పోస్టర్లను ముద్రించి అంటించారు. నాయకుల మధ్య ఉన్న రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఇలాంటి కుట్రలకు తెరతీస్తున్నారనే విమర్శలు అప్పట్లోనే బలంగా వినిపించాయి. ఒక జాతీయ పార్టీలో ఇలాంటి చౌకబారు రాజకీయాలు చోటుచేసుకోవడం పట్ల సాధారణ కార్యకర్తలు సైతం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ నాయకుల విచిత్ర తీరును తప్పుబట్టారు. ఇది ఏమాత్రం సరైనది కాదన్నారు. ఇక తాజా వివాదానికి ప్రధాన కారణం నామినేటెడ్ పదవుల పంపకమే అని తెలుస్తోంది. ఈ ఏడాది జనవరి నెలలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన కీలక బీజేపీ నేత జన్యావుల రామకృష్ణ ఒక నామినేటెడ్ పోస్టుకు ఎంపికయ్యారు. అంతా సవ్యంగా ఉందనుకుంటున్న తరుణంలో మరుసటి నెలలోనే ఈటల రాజేందర్ నేరుగా ఢిల్లీ వెళ్లి చక్రం తిప్పారు. పార్టీ పెద్దలతో మాట్లాడి ఆ పదవి కాస్తా తన సొంత అనుచరుడి కుటుంబ సభ్యులకు దక్కేలా పావులు కదిపారు. చేతిదాకా వచ్చిన పదవి తృటిలో చేజారిపోవడంతో రామకృష్ణకు ఈటల రాజేందర్ పై చెప్పలేనంత స్థాయిలో తీవ్రమైన కోపం ఆగ్రహం కట్టలు తెంచుకున్నాయి. ఎంతో తీవ్రమైన కక్షగా ఇప్పుడు మారాయి.

# కారుకు పది సీట్లు రావు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాజకీయ వేదికలపై నేతల మాటల యుద్ధం రోజురోజుకూ వేడెక్కుతోంది. అధికార పక్షానికి, ప్రతిపక్షానికి మధ్య జరుగుతున్న మాటల తూటాల దాడిలో ఇప్పుడు పెద్దపల్లి పర్యటన కీలకంగా మారింది. మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పందిస్తూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు తలకిందులుగా తపస్సు చేసినా, మునిగిపోయే కారుకు 10 సీట్లు కూడా వచ్చే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. వంద సీట్లు సాధిస్తామనే పగటి కలలు కనడం మానుకోవాలని సూచించారు. రెండున్నరేళ్ల పాలనలోనే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విసిగిపోయారని హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు కేవలం భ్రమలు మాత్రమేనని, క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరుగా ఉన్నాయని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సీఎల్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, హరీశ్‌రావు ఆరోపణలను తిప్పికొట్టారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ పార్టీ చూపిన అహంకారానికి ప్రజలు ఇప్పటికే ప్రతిపక్ష స్థానానికి పరిమితం చేశారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. శాసనసభ, లోక్‌సభ, స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కర్ర కాల్చి వాత పెట్టిన తీరును మర్చిపోవడం సరికాదని వ్యాఖ్యానించారు. ప్రజాపాలన చూసి బీఆర్ఎస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని ఎద్దేవా చేశారు. ప్రజల తీర్పును గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. ఇటువంటి విమర్శల ద్వారా రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూడడం హాస్యాస్పదంగా ఉందని అభిప్రాయపడ్డారు. పెద్దపల్లి జిల్లాలో భూముల ధరలు తగ్గాయని హరీశ్‌రావు ఆరోపించడంపై శ్రీధర్‌బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆ పార్టీకి చెందిన నాయకులు, ల్యాండ్ మాఫియా కలిసి కృత్రిమంగా భూముల ధరలను పెంచేశారని ఆరోపించారు. సామాన్యుడు గజం భూమి కొనాలన్నా, సొంత ఇల్లు కట్టుకోవాలన్నా భయపడే పరిస్థితిని సృష్టించింది ఎవరు? అని నిలదీశారు. వాస్తవాలను వక్రీకరించి మాట్లాడడం మాజీ మంత్రిగా మీకు తగదని హెచ్చరించారు. భూముల ధరల పెరుగుదల వెనుక ఉన్న మాఫియా కథాకమీమామిషును ప్రజలందరూ గమనిస్తున్నారని, అభివృద్ధి పేరుతో జరిపిన దోపిడీని ఎవరూ మర్చిపోలేదని స్పష్టం చేశారు. పోలీస్ వ్యవస్థపై హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను శ్రీధర్‌బాబు తప్పుబట్టారు. గత ప్రభుత్వ హయాంలో పోలీసులను ప్రగతి భవన్ కాపలాదారులుగా మార్చి, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది కేసీఆర్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే బీఆర్ఎస్ నాయకులకు, వారి బంధువులకు మాత్రమే అని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం పోలీసుల హక్కులకు, సంక్షేమానికి సంపూర్ణంగా కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. జీతాల కోత, అలవెన్సుల రద్దు వంటివి కేవలం బీఆర్ఎస్ ఐటీ సెల్ సృష్టించిన అభూతకల్పనలు మాత్రమేనని పేర్కొన్నారు. పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న కృషిని శ్రీధర్‌బాబు అభినందించారు. సమాజంలో శాంతియుత వాతావరణాన్ని కాపాడేందుకు, నేర నియంత్రణకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు చేస్తూ, సమాజంలో విద్వేషాలు రేకెత్తించే వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే దాన్ని కక్షపూరితం అనడం ఎంతవరకు సమంజసం అని నిలదీశారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవడం చట్టం ముందు సమానత్వం కిందికి వస్తుందని చెప్పారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంటే, దాన్ని రాజకీయ రంగు పులమడం బీఆర్ఎస్ నాయ



కులకు అలవాటుగా మారిందని విమర్శించారు. పెద్దపల్లి జిల్లాలో జరిగిన పార్టీ సమావేశంలో హరీశ్‌రావు చేసిన హెచ్చరికలను మంత్రి తీవ్రంగా పరిగణించారు. ప్రభుత్వ, పోలీస్ అధికారుల పేర్లు ప్రస్తావిస్తూ, తాము అధికారంలోకి వచ్చాక బుద్ధి చెబుతామని బహిరంగంగా హెచ్చరించడం ఒక మాజీ మంత్రి స్థాయికి తగదని హితవు పలికారు. అధికారులు చట్టానికి లోబడి బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారని, వారికి తమ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎవరో చేసే తాటాకు చప్పుళ్లకు భయపడాల్సిన అవసరం లేదని, విధి నిర్వహణలో ఎవరూ వెనకడుగు వేయవద్దని అధికారులకు స్పష్టం చేశారు. బెదిరింపు రాజకీయాలను ప్రజలు ఎప్పుడో తిరస్కరించారని గుర్తు చేశారు. శాస్త్రీయ దృక్పథంతో ఆలోచిస్తే, ఈ పరిణామాలు రాజకీయ పతనం వైపు సాగుతున్నాయని అర్థమవుతుంది. ఆధునిక సమాజంలో పారదర్శకమైన పాలన కోరుకునే ప్రజలు, ఇటువంటి అశాస్త్రీయ ఆరోపణలను నమ్మే స్థితిలో లేరు. సైన్స్, టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న తరుణంలో, డేటా విశ్లేషణ ద్వారా నిజాలను తెలుసుకునే అవకాశం ప్రతి పౌరుడికి ఉంది. కాబట్టి రాజకీయ విమర్శలు చేసేటప్పుడు వాస్తవ గణాంకాలను పరిగణనలోకి తీసుకోవడం బాధ్యతాయుతమైన పని. అబద్ధపు ప్రచారాలు సోషల్ మీడియాలో నిమిషాల వ్యవధిలో బయటపడుతున్నాయి. దీనిని అర్థం చేసుకోకుండా ఇంకా పాత పద్ధతుల్లో రాజకీయాలు చేయడం బీఆర్ఎస్ పార్టీకి చేటు తెస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వ అధికారుల స్థైర్యాన్ని దెబ్బతీసే చర్యలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తాయి. వ్యవస్థలు బలంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. పోలీసులు ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తిస్తుంటే, వారిని రాజకీయాల్లోకి లాగడం సరికాదు. పోలీసుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. దీనిని విస్మరించి, లేనిపోని ఆరోపణలు చేయడం ప్రతిపక్షాలకు ఆనవాయితీగా మారింది. అధికారులు ఎవరి ఒత్తిళ్లకు లోనుకాకుండా, రాజ్యాంగం కల్పించిన హక్కులతో విధులు నిర్వహించాలని ప్రభుత్వం కోరుకుంటోంది. భయం లేని వాతావరణంలోనే అధికారులు సమర్థవంతంగా పనిచేయగలరని మంత్రి శ్రీధర్‌బాబు పునరుద్ఘాటించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు అది అర్థం చేసుకోవాలని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఓటమిని అంగీకరించి నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించడం ప్రజలకు మేలు చేస్తుంది. లేనిపోని అపోహలు సృష్టించడం వల్ల పార్టీకి వచ్చే లాభం ఏమీ ఉండదు. పైగా ప్రజల్లో చులకన కావాల్సి వస్తుంది. పదేళ్ల కాలంలో జరిగిన తప్పులను సరిదిద్దుకోవడానికి సమయం తీసుకుంటే మంచిదని సూచించారు. ప్రతిపక్షం అంటే కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, ప్రభుత్వానికి మంచి సూచనలు చేసేలా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజాస్వామ్యం ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని, వారి తీర్పును శిరసావహించాలని చెప్పారు. ప్రభుత్వ విధానాలను విమర్శించే హక్కు ప్రతిపక్షానికి ఉన్నప్పటికీ, అది హుందాగా ఉండాలని మంత్రి కోరారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

ద్రవరూపంలో ఉన్న అత్యంత వేడి లోహం కార్మికులపై పడటంతో ఈ దుర్ఘటన అత్యంత తీవ్రతను సంతరించుకుంది. ప్లాంట్ ఆవరణలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలముకున్నాయి. మరణించిన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. పారిశ్రామిక వేత్తలు, కార్మిక సంఘాలు ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రమాదం జరిగిన తీరు పట్ల ప్రాథమిక పరిశీలనలో సాంకేతిక లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దాదాపు 1500 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద ఉండే ద్రవ లోహాన్ని ఒక చోటు నుంచి మరోచోటికి తరలించడం అత్యంత ప్రమాదకరమైన ప్రక్రియ. ల్యాడల్‌ను పట్టుకునే క్రేన్ వ్యవస్థ లేదా బకెట్లను నిలిపి ఉంచే హుక్స్‌లో ఏదైనా యాంత్రిక వైఫల్యం సంభవించి ఉండవచ్చు. మెటలర్జీ శాస్త్రం ప్రకారం ద్రవ లోహాన్ని మోసుకెళ్లే ల్యాడల్స్ అపారమైన బరువును, ఉష్ణోగ్రతను భరించాలి. క్రేన్ గిర్డ్లు లేదా కేబుల్స్ అకస్మాత్తుగా తెగిపోవడం వంటి భౌతిక సంఘటనలు ఇటువంటి ఘోరాలకు దారితీస్తాయి. ఈ మొత్తం ప్రక్రియలో భద్రతా సెన్సార్లు పనిచేయకపోవడం ఒక ప్రధాన లోపంగా అనుమానించవచ్చు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఉదంతంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులతో అత్యవసరంగా మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన వారికి అందుతున్న వైద్య సేవలపై ఆయన ఆరా తీశారు. కార్మికుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేస్తూనే, మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పరం సహకరించుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ప్రమాదం జరగడానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరపాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హోంమంత్రి వంగలపూడి అనిత కూడా ఈ ప్రమాదంపై వెంటనే స్పందించారు. విజయనగరం పర్యటనలో ఉన్నప్పటికీ, సమాచారం అందిన వెంటనే ఆమె హుటాహుటిన విశాఖకు బయలుదేరారు. జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్‌తో ఆమె ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యల గురించి వివరాలు



తెలుసుకున్నారు. క్షతగాత్రులకు అత్యుత్తమ చికిత్స అందేలా చూడాలని వైద్య సిబ్బందికి ఆమె స్పష్టం చేశారు. ప్రమాద స్థలంలో పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి, భద్రతా ప్రమాణాలను పునఃసమీక్షించాల్సిన అవసరాన్ని ఆమె నొక్కి చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండి బాధితులకు అవసరమైన సాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం నిర్వహణలో భద్రతా నియమావళి అమలులో నిర్లక్ష్యం జరిగిందా అన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఏటా వందల కోట్ల రూపాయల టర్నోవర్ కలిగిన ఈ సంస్థలో కార్మికుల భద్రతే ప్రధాన ప్రాధాన్యత కావాలి. ప్రతి యంత్రం, ప్రతి పరికరం నిర్ణీత సమయాల్లో తనిఖీలకు లోబడి ఉండాలి. భద్రతా ప్రమాణాల పాటించడంలో స్వల్ప లోపం కూడా ప్రాణ నష్టానికి దారితీస్తుంది. మెకానికల్ ఇంజనీరింగ్ కోణంలో చూస్తే ల్యాడల్స్ నిర్వహణకు సంబంధించి ప్రతి రోజూ చేయాల్సిన తనిఖీల్లో లోపాలు జరిగాయా అనే అంశం కీలకం. ప్రమాద స్థలంలో నిపుణుల బృందం పరిశీలనలు జరుపుతోంది. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై అధికారులు విచారణ ప్రారంభించారు. ల్యాడల్ ద్రవ లోహంతో ఉన్నప్పుడు బకెట్లు విడిపోవడానికి దారితీసిన భౌతిక కారణాలను విశ్లేషిస్తున్నారు. సాంకేతిక లోపమా లేక యంత్రాల కాలపరిమితి ముగిసిందా అనే అంశాలపై నివేదిక తయారు చేస్తున్నారు. ఘటన జరిగిన సమయంలో అక్కడ ఉన్న సెన్సార్ రికార్డులను, లాగ్ బుక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. భద్రతా ప్రమాణాలను పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసే అవకాశం ఉంది. పూర్తిస్థాయి నివేదిక వచ్చిన తర్వాతే జరిగిన నష్టం స్థాయి, బాధ్యులపై చర్యలు స్పష్టంగా వెల్లడవుతాయి. ప్రమాదం జరిగిన వెంటనే యాజమాన్యం అత్యవసర భద్రతా చర్యలను చేపట్టింది. స్టీల్ ప్లాంట్ ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య బృందాలను సిద్ధం చేసి గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి కూడా నిపుణులైన వైద్యులను పిలిపించి మెరుగైన వైద్యం అందించడానికి ప్రయత్నిస్తున్నారు. కార్మికుల కుటుంబ సభ్యులు, తోటి కార్మికులను ఓదార్చడం ప్లాంట్ అధికారులకు ఇప్పుడు పెద్ద సవాలుగా మారింది. ప్లాంట్ ఆవరణలో భద్రతా దళాలను భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆందోళన చెందుతున్న కార్మికులకు భరోసా ఇచ్చేలా అధికారులు వ్యవహరిస్తున్నారు. పారిశ్రామిక భద్రతలో మనుషుల ప్రాణాలు ఎంతటి విలువైనవో ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది. ఇనుము, ఉక్కు పరిశ్రమలు అత్యంత ప్రమాదకరమైన పని వాతావరణం కలిగి ఉంటాయి. ఇక్కడ చిన్నపాటి పొరపాటు కూడా పెద్ద విపత్తుకు దారితీస్తుంది. ప్రమాదాలు జరగకుండా అడ్డుకోవడానికి అత్యాధునిక రోబోటిక్ సాంకేతికతను, ఆటోమేషన్ వ్యవస్థలను వాడటంపై దృష్టి సారించాలి. మనుషుల ప్రమేయం లేకుండా ద్రవ లోహాన్ని రవాణా చేసే పద్ధతులను ప్రవేశ పెట్టడం భవిష్యత్తులో ప్రాణ నష్టాన్ని తగ్గించడానికి దోహదపడుతుంది. ఈ ప్రమాదం నుంచి పాఠాలు నేర్చుకుని భద్రతా నియమాలను మరింత కఠినతరం చేయాలి. ప్రభుత్వం ఈ ఘటనపై సమగ్ర నివేదిక కోరింది. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు తగిన పరిహారం అందజేసేలా చర్యలు తీసుకునే యోచనలో ఉంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. దర్యాప్తు నివేదిక బయటకు వచ్చాక రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మరింత స్పందించే అవకాశం ఉంది. ఈ దుర్ఘటన ప్లాంట్ యాజమాన్యానికి పెద్ద మచ్చగా మారింది. కార్మికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే ఇటువంటి సంఘటనలు మళ్ళీ జరగకుండా చూడటమే ఇప్పుడున్న ప్రధాన లక్ష్యం. బాధితుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకు నిరసనలు, చర్చలు కొనసాగే అవకాశం కనిపిస్తోంది.

# లక్ష కోట్లు దాటిన హైడ్రా వేట

- రెండేళ్లలో రూ. 1.10 లక్షల కోట్ల ప్రభుత్వ భూముల స్వాధీనం
- వచ్చే ఏడాది నాటికి రూ. 2 లక్షల కోట్లకు చేరనుంది
- చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల సంరక్షణ
- కోకాపేట, నార్సింగి వంటి చోట్ల వేల కోట్ల భూముల రక్షణ
- భూ మాఫియాను అడ్డుకోవడానికి ప్రజల మద్దతు అవసరం
- ఆక్రమణలను తొలగించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో నూతన అధ్యాయం ఆరంభమైంది. అక్రమార్కుల గుప్పిట చిక్కుకున్న విలువైన భూములను వెలికితీస్తూ హైడ్రా సంస్థ సంచలన ఫలితాలు సాధిస్తోంది. గత రెండేళ్ల కాలంలో ఈ సంస్థ చేపట్టిన చర్యలు ఫలితాలను ఇస్తున్నాయి. లక్ష కోట్ల రూపాయల పైచిలుకు ప్రభుత్వ భూములను కాపాడటంలో ఈ వ్యవస్థ సఫలమైంది. పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు నగరాన్ని వరదల నుంచి రక్షించేందుకు చెరువులు, నాలాల ఆక్రమణలను తొలగించడం అత్యంత కీలకమైన అంశంగా మారింది. ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే వేల ఎకరాల విస్తీర్ణంలోని భూములను స్వాధీనం చేసుకున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించిన గణాంకాల ప్రకారం, గడిచిన రెండేళ్ల వ్యవధిలో ఏకంగా లక్షా పది వేల కోట్ల రూపాయల విలువైన భూములను కబ్జాదారుల చెర నుంచి విముక్తి చేశారు. కేవలం భూమి విలువ పరంగానే కాకుండా, నగర భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఈ ఆస్తుల సంరక్షణ ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అక్రమ నిర్మాణాలు, చెరువుల ఆక్రమణలు, నాలాల గమనాన్ని మళ్లించడం వంటి చర్యల వల్ల నగరం ఎదుర్కొంటున్న ముప్పులను అరికట్టేందుకు ఈ సంస్థ నిరంతరం శ్రమిస్తోంది. రాబోయే ఏడాది కాలంలో ఈ స్వాధీనం చేసుకున్న భూముల విలువ రెండు లక్షల కోట్ల రూపాయలను సునాయాసంగా అధిగమిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కోకాపేట, పుప్పాలగూడ, నార్సింగి వంటి ప్రాంతాలలో చేపట్టిన ఆపరేషన్లు భూ మాఫియా వెన్నులో వణుకు పుట్టించాయి. వేలాది కోట్ల రూపాయల ప్రభుత్వ భూములను గుర్తించి, కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకున్న వెంటనే ఆ ప్రాంతాలలో కంచెలు ఏర్పాటు చేయడం ద్వారా భూమిని భద్రపరిచారు. అక్కడ ప్రభుత్వ స్థలాలు అని స్పష్టంగా బోర్డులు తగిలించడం ద్వారా అక్రమార్కులకు బలమైన హెచ్చరికలు పంపారు. కేవలం బోర్డులు పెట్టడంతోనే సరిపెట్టకుండా, ఆ భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డులను పటిష్టం చేసే పనిని కూడా సమాంతరంగా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. నగరంలో పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా చెరువుల ఎఫ్టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను గుర్తించి తొలగించడం ఒక యజ్ఞంలా సాగుతోంది. నాలాలను ఆక్రమించి నిర్మించిన కట్టడాల వల్ల ఏటా వర్షాకాలంలో నగర ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించేందుకు ఈ చర్యలు దోహదపడుతున్నాయి. భూ కబ్జాల నివారణలో ప్రజలు, మీడియా భాగస్వామ్యం అత్యంత అవసరమని కమిషనర్ రంగనాథ్ పేర్కొనడం గమనార్హం. పౌరుల నుంచి వస్తున్న ఫిర్యాదులు, ఆధారాలతో కూడిన సమాచారం ఆధారంగానే అత్యంత కీలకమైన భూములను కాపాడగలుగుతున్నామని ఆయన స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు. భూ మాఫియా పన్నాగాలను ఎప్పటికప్పుడు ఛేదించేందుకు హైడ్రా అత్యాధునిక సాంకేతికతను వాడుకుంటోంది. శాటిలైట్ మ్యాపింగ్, జియో ట్యాగింగ్ వంటి పద్ధతుల ద్వారా ఏళ్ల క్రితం ప్రభుత్వ భూములు ఎలా ఉండేవో, ఇప్పుడు ఏ రూపంలోకి మారాయో స్పష్టంగా విశ్లేషిస్తున్నారు. అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారిపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వందల సంఖ్యలో ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయడమే కాకుండా, వారిని చట్టం ముందు నిలబెట్టే ప్రక్రియను వేగవంతం చేశారు. ఎంతో మంది అక్రమార్కులు గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు భయంతో ఆక్రమిత భూములను స్వచ్ఛందంగా వదిలేయడం విశేషం. ప్రభుత్వ భూముల విలువ లెక్కలు చూస్తే సామాన్యుల కళ్లు చెదిరేలా ఉన్నాయి. ఒక్కో ఎకరా భూమి విలువ కోట్లాది రూపాయలు పలుకుతున్న ఈ కాలంలో, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం అంటే రాష్ట్ర ఆర్థిక వనరులను కాపాడటమేనని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఈ భూములను భవిష్యత్తులో ప్రజోపయోగ అవసరాల కోసం లేదా మౌలిక వసతుల కల్పన కోసం వినియోగించే అవకాశం ఉంది. కబ్జాదారులు నిర్మించిన విలాసవంతమైన ఫాంహౌస్‌లను, భవనాలను సైతం ఉపేక్షించకుండా తొలగించడం ద్వారా చట్టం అందరికీ సమానమేనని నిరూపించారు. సామాజిక న్యాయం దిశగా ఈ వ్యవస్థ వేస్తున్న అడుగులు సామాన్యులకు గొప్ప ధైర్యాన్ని ఇస్తున్నాయి. కబ్జాకు గురైన నాలాల వల్ల నగరం అస్తవ్యస్తమవుతున్న తీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉంది. నాలాల గమనాన్ని మళ్లించి భూమిని ఆక్రమించుకున్న వారిని గుర్తించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. వరద నీరు సాఫీగా సాగిపోయేలా నాలాల వెడల్పును పెంచుతున్నారు. అక్రమ కట్టడాల వల్ల తలెత్తుతున్న సమస్యలను పరిష్కరిస్తూ నగర ప్రజల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ క్రమంలో ఎవరైనా అడ్డంకులు సృష్టించినా, అక్రమ రాజకీయ ఒత్తిళ్లు పెంచినా లెక్క చేయకుండా తమ విధిని నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడటంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు. హైడ్రా చేపట్టిన ఈ చర్యల వల్ల ప్రభుత్వ ఖజానాకు అదనపు ఆదాయ మార్గాలు దారి చూపేలా ఉన్నాయి. స్వాధీనం చేసుకున్న భూములను వాణిజ్య పరంగా లేక పారిశ్రామికంగా అభివృద్ధి చేయడం వల్ల రాష్ట్ర ఆదాయం పెరుగుతుంది. ఇప్పటికే వెయ్యి కోట్ల రూపాయల విలువైన ఆస్తుల రికవరీ జరగగా, రాబోయే రోజుల్లో దీని పరిధిని మరింత పెంచే లక్ష్యంతో ఉన్నారు. అక్రమ భూముల క్రయవిక్రయాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెంచారు. రియల్ ఎస్టేట్ రంగంలో పేరున్న సంస్థలు సైతం ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినట్లు తేలడంతో, ఆయా సంస్థలపై సైతం కఠినమైన వేటు వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజలు కూడా భూములను గుర్తించే వీలు కలుగుతోంది. ఎవరైనా భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే వెంటనే సమాచారం ఇచ్చేలా ప్రత్యేక కాల్ సెంటర్లను ఏర్పాటు చేశారు. మీడియాలో వస్తున్న కథనాలపై వెంటనే స్పందిస్తూ క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతున్నారు. అధికార యంత్రాంగం, ప్రజల మధ్య ఉన్న అంతరాన్ని చెరిపివేస్తూ, భూమికి రక్షణ కల్పించేలా కృషి చేస్తున్నారు. కబ్జాదారుల నుంచి భూములను కాపాడటం అంటే అది భవిష్యత్తు తరాలకు అందించే గొప్ప ఆస్తి. అక్రమాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతుండటంతో కబ్జాదారుల్లో వణుకు మొదలైంది. ప్రభుత్వ ఆస్తులను కాపాడటం ద్వారా సామాజిక క్రమశిక్షణను కాపాడవచ్చుననే భావన బలపడుతోంది. లక్ష కోట్ల రూపాయల విలువైన భూములను సంరక్షించిన ఘనత దక్కడం వెనుక ఉన్న కఠినమైన నిర్ణయాలు, సాహసోపేతమైన చర్యలు చరిత్రలో నిలిచిపోతాయి. పర్యావరణ పరిరక్షణ, వరదల నివారణ, భూముల రక్షణ ఇలా అన్నింటిలోనూ విజయపథంలో దూసుకెళ్తున్న ఈ వ్యవస్థ, నగరానికి ఒక రక్షక కవచంలా పనిచేస్తోంది. కబ్జాదారులు ఎన్ని పన్నాగాలు పన్నినా, హైడ్రా తన గమ్యం వైపు దూసుకుపోతోంది.

## కాచిగూడ సంక్షేమ బాయ్స్ హాస్టల్‌ని మోడల్ హాస్టల్‌గా నిర్మిస్తాం

**తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క**



**విశాలభారతి, అంబర్‌పేట:** రాష్ట్రవ్యాప్తంగా షెడ్యూల్ కులాల విద్యార్థులకు కేంద్రంగా ఉన్న కాచిగూడ హాస్టల్ ని 50 కోట్ల రూపాయలతో ఐదు అంతస్తుల నూతన భవనాన్ని నిర్మిస్తామన్నారు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క. ఆయన సోమవారం కాచిగూడ హాస్టల్ లో సందర్శించారు. హాస్టల్ పూర్వ విద్యార్థి డా. రుద్రవరం లింగస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ హాస్టల్‌ని సందర్శించి అనేక రూములను పరిశీలించి నూతన భవన నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అభివృద్ధి ఒకవైపు సంక్షేమం ఒకవైపు లక్ష్యాలను పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఈ హాస్టల్ ఎంతోమందికి ఉన్నతంగా ఎదిగేందుకు దోహద పడిందని, తాను కూడా ఒక సంవత్సరం ఈ హాస్టల్లో ఉన్నానని గుర్తు చేస్తూ.. ఒక మోడల్ హాస్టల్ నూతన టెక్నాలజీని భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా నిర్మిస్తామని తెలిపారు. డాక్టర్ బాబు జగ్జీవన్ పేరుతో హాస్టల్ నిర్మాణం జరుగుతుందని త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభించి ఒక సంవత్సరం లోనే నిర్మించాలని అధికారులను ఆదేశించారు. కాచిగూడ హాస్టల్ పూర్వ విద్యార్థులుగా ఎన్నో సంవత్సరాల నూతన హాస్టల్ నిర్మాణం కోసం చేసిన పోరాటం ఫలించిందని పూర్వ విద్యార్థి డా. రుద్రవరం లింగస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కలెక్టర్ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు, కాచిగూడ హాస్టల్ పూర్వ విద్యార్థులు గిరి, నక్క యాదయ్య, గోవిందు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు అమ్మినా.. కొన్నా నేరం

**విశాలభారతి, మొయినాబాద్:** ప్రభుత్వ భూములు, అసైండ్ భూములు కొనడం అమ్మడం చట్ట విరుద్ధం అని మొయినాబాద్ తహసీల్దార్ కే. గౌతమ్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు అజీజ్ నగర్ గ్రామంలో సర్వే నెం. 176లో 30 ఎకరాల ప్రభుత్వ భూమిని నూతన మార్కెట్ కొరకు ప్రభుత్వం కేటాయించిందని, మిగతా భూమిని కూడా ప్రజావసరాల కొరకు కేటాయిస్తామని ఈ సందర్భంగా గౌతం కుమార్ తెలిపారు. అయితే కొంత మంది దళారులు అజీజ్ నగర్‌లోని సర్వే నెం. 176, 177లో ఇట్టి భూములను పట్టా భూములని అమాయక ప్రజలకు అమ్ముతున్నారని స్థానికంగా చర్చించుకుంటున్నట్టు తెలిసిందని తెలిపారు.

## రేవంత్ హిట్లరే కాదు.. తాలిబన్ కూడా

**మొదటిపేజీ తరువాయి**

దూరం చేయాలన్న ఒకే ఒక్క కుట్ర పూరిత ఉద్దేశంతోనే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను మూసివేసేందుకు ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను ఒక సర్కస్ కంపెనీ మాదిరిగా మార్చేశారని దుయ్యబట్టారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సోమవారం రోజున ఒక ప్రత్యేకమైన వీడియో సందేశాన్ని ప్రజల కోసం విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సామాన్య ప్రజలకు నాణ్యమైన విద్యను అందించాల్సిన ప్రభుత్వమే బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 27 వేల ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు చదువును అందిస్తుండగా వాటి సంఖ్యను కేవలం 4 వేలకు కుదించాలని ముఖ్యమంత్రి ఆలోచించడం ఆయన దిగజారుడు ఆలోచనా విధానానికి అద్దం పడుతోందని విమర్శించారు. ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్న రేవంత్ రెడ్డిని కేవలం హిట్లర్ అనడం సరిపోదని అంతకంటే క్రూరమైన నియంత అని వ్యాఖ్యానించారు. పేదలకు చదువును దూరం చేసే ఇలాంటి నిర్ణయాలు సమాజాన్ని పది దశాబ్దాల వెనక్కి నెట్టివేస్తాయని హెచ్చరించారు. ముఖ్యమంత్రికి రాష్ట్రంలోని విద్యాశాఖపై ఏమాత్రం కనీస పట్టు లేదని కవిత ఎద్దేవా చేశారు. విద్యా వ్యవస్థను నడిపించాల్సిన నాయకుడే దానిని ఒక ఆటబొమ్మగా మార్చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత కూడా విధానపరమైన నిర్ణయాలు తీసుకోకపోవడం ప్రభుత్వ అసమర్థతను కళ్ళకు కడుతోందని తెలిపారు. కీలకమైన శాఖను ఒక సర్కస్ లెక్క మార్చేసి విద్యార్థుల జీవితాలతో ముఖ్యమంత్రి చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యాశాఖ కాస్తా ఇప్పుడు గందరగోళానికి కేంద్ర బిందువుగా మారిపోయిందని విమర్శించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన చెందారు. ప్రభుత్వ పెద్దల మధ్య కనీస సమన్వయం లేకపోవడానికి ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో జరుగుతున్న సంఘటనలే ప్రత్యక్ష ఉదాహరణ అని గుర్తు చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్య ఉండబోదని సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి అత్యంత బాధ్యతారహితంగా ఒక ప్రకటన చేశారని ప్రస్తావించారు. అయితే ముఖ్యమంత్రి ఆ విధంగా ప్రకటించిన మరుసటి రోజే విద్యాశాఖ అధికారులు దానికి విరుద్ధంగా వ్యవహరించారు. ఇంటర్ బోర్డు అధికారులు ఎప్పటిలాగే ప్రవేశాలకు సంబంధించిన



నోటిఫికేషన్ విడుదల చేసి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించే ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్యమంత్రి మాటలకు అధికారుల చేతలకు మధ్య ఉన్న ఈ భారీ వ్యత్యాసం ప్రభుత్వ డొల్లతనాన్ని బయటపెడుతోందని కవిత స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కాలేజీలు ప్రారంభమై దాదాపు వారం రోజులు గడిచిపోయినా ఇప్పటివరకు విద్యాశాఖలో ఎలాంటి స్పష్టతా రాలేదని కవిత తప్పుబట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటుగా ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు కూడా ఈ అసమర్థ ప్రభుత్వం కనీసం అఫిలియేషన్లు కూడా ఇవ్వలేని దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతోందని విమర్శించారు. గుర్తింపు లేని కళాశాలల్లో విద్యార్థులు ఏ విధంగా చదువుకోవాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. అఫిలియేషన్ల ప్రక్రియను సకాలంలో పూర్తి చేయకపోవడం వల్ల విద్యార్థులు తమ విద్యా సంవత్సరాన్ని నష్టపోయే తీవ్రమైన ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యా వ్యవస్థ కుప్పకూలే పరిస్థితి వచ్చిందని వాపోయారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల పరిస్థితి ఇలా ఉంటే డిగ్రీ చదువుకునే విద్యార్థుల భవిష్యత్తును డిగ్రీ అడ్మిషన్ల పేరుతో ప్రభుత్వం మరింత గందరగోళంగా మార్చేసిందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత విద్యా మండలి ఒకవైపు కొన్ని ప్రత్యేకమైన కోర్సులను విద్యార్థులకు సిఫారసు చేస్తూ నిర్ణయం తీసుకుందని తెలిపారు. దానికి పూర్తి భిన్నంగా హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ అధికారులు తమ ఇష్టానుసారం మరికొన్ని కొత్త కోర్సులను విద్యార్థుల ముందు ఉంచారని వెల్లడించారు. రెండు కీలకమైన ప్రభుత్వ విభాగాలు వేర్వేరు కోర్సులను సిఫారసు చేయడం వల్ల డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని వివరించారు. ఈ పరిణామం పాలకుల అనాలోచిత నిర్ణయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఉన్నత విద్యా మండలి సిఫారసు చేసిన కోర్సులకు గానీ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ ప్రతిపాదించిన కోర్సులకు గానీ ఇప్పటి వరకు ఏ ఒక్క యూనివర్సిటీ కూడా అధికారికంగా అప్రూవల్ ఇవ్వలేదని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. యూనివర్సిటీల నుంచి కనీస ఆమోదం పొందకుండానే రాష్ట్రవ్యాప్తంగా దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియను మొండిగా కొనసాగించడం ఏ రకమైన పాలన అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. గుర్తింపు లేని కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. విద్యార్థుల జీవితాలతో ఇలాంటి ప్రమాదకరమైన ప్రయోగాలు చేయడం తక్షణం మానుకోవాలని ఈ ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో అత్యంత విషాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయని కవిత ఆవేదన చెందారు. ప్రభుత్వం మారిన తర్వాత సరైన సౌకర్యాలు పర్యవేక్షణ లేకపోవడం వల్ల గురుకులాల్లో 100 మందికి పైగా అమాయక విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని అత్యంత విచారం వ్యక్తం చేశారు. ఇన్ని ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా ఈ రాష్ట్ర ముఖ్యమంత్రికి కనీస చీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ఇంతటి దారుణమైన పరిస్థితులు రాష్ట్రంలో ఉంటే ముఖ్యమంత్రి కనీసం ఒక్కసారి కూడా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించకపోవడం ఆయన నిర్లక్ష్య వైఖరిని తెలియజేస్తోందని కవిత దుయ్యబట్టారు. పేద విద్యార్థుల ప్రాణాలంటే ప్రభుత్వానికి లెక్కలేకుండా పోయిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఉద్దేశించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఈ ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చిందని కవిత ఆరోపించారు. గత ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్న సుమారు 11 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం పైన ఉందని గుర్తు చేశారు. అయితే బకాయిలు చెల్లించకుండా తప్పించుకునే ఉద్దేశంతో నేరుగా విద్యార్థులకే ట్యూషన్ ఫీజులు ఇస్తామని ప్రభుత్వం కొత్త నాటకానికి తెరతీసిందని విమర్శించారు. ఈ కుట్రలో భాగంగానే ప్రభుత్వం జీవో నెంబర్ 7 ను అత్యంత రహస్యంగా తీసుకువచ్చిందని ఆరోపించారు. ఈ విధానం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని కవిత హెచ్చరించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త జీవో నెంబర్ 7 కారణంగా ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను నిలువునా దోచుకునేందుకు దారి తీస్తుందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు.

# ఓం భీం బుష్..!

**మొదటిపేజీ తరువాయి**



సామాజిక పరిణామంలో ఒక విచిత్రమైన అంశంగా కనిపిస్తుంది. ఈ చేప ప్రసాదం కార్యక్రమం దాదాపు 176 ఏళ్ల సుదీర్ఘ నేపథ్యాన్ని కలిగి ఉందని బత్తిని కుటుంబ సభ్యులు చెబుతుంటారు. నిజాం పాలనా కాలంలో ఒక సాధువు అందించిన రహస్య వనమూలికా ఫార్ములాను, వాణిజ్యపరంగా కాకుండా ఉచితంగా పంపిణీ చేయాలనే నిబంధనతో ఐదు తరాలుగా ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. మృగశిర కార్తె ప్రవేశించిన సమయంలో వాతావరణంలో వచ్చే మార్పులు, మనుషుల ఆరోగ్య స్థితిగతులపై చూపే ప్రభావాల నేపథ్యంలో ఈ ప్రసాదం ప్రాముఖ్యతను వారు వివరిస్తారు. కానీ, ఈ ఔషధ గుణాల గురించి ఎలాంటి అధికారిక శాస్త్రీయ పత్రాలు లేవు. ఒక చిన్న కొర్రమీను చేప పిల్ల నోటిలో పసుపు రంగు మూలికా మిశ్రమాన్ని పెట్టి రోగి గొంతులోకి పంపడం అనేది ఎంతవరకు సమంజసమో, దీని వల్ల ఆరోగ్యానికి కలిగే మేలు ఏమిటో ఎవరికీ స్పష్టత లేదు. శాస్త్రీయంగా ఆలోచిస్తే ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులు అనేవి శరీరంలో జరిగే సంక్లిష్టమైన జీవక్రియలకు సంబంధించినవి. వీటిని కేవలం ఒక మూలిక ముద్ద మింగడం ద్వారా నయం చేయడం సాధ్యం కాదు. జన విజ్ఞాన వేదిక వంటి హేతువాద సంఘాలు ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూనే ఉన్నాయి. ప్రయోగశాలల్లో ఈ మందును పరీక్షించినప్పుడు, అందులో ప్రమాదకర రసాయనాలు లేవని తేలింది నిజమే, అయితే అది ఆస్తమాను నివారించగలదని నిరూపించే ఒక్క ఆధారమూ లభించలేదు. కేవలం రోగి నమ్మకం మీద ఆధారపడి పనిచేసే ప్లేసిబో ఎఫెక్ట్ మాత్రమే ఇక్కడ కనిపిస్తుంది. రోగి తన వ్యాధి నయమవుతుందని బలంగా నమ్మడం వల్ల కొంత ఉపశమనం పొందినట్లు అనిపించినా, అది వైద్యపరమైన చికిత్సగా పరిగణించబడదు. ఈ క్రమంలో న్యాయస్థానాల జోక్యం కూడా కీలకంగా మారింది. గతంలో ఈ మిశ్రమాన్ని 'మందు' అని పిలవడంపై వచ్చిన వివాదాల నేపథ్యంలో, కోర్టులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాయి. దీనికి శాస్త్రీయత లేనందున దీనిని మందు అని పిలవడానికి వీల్లేదని, కచ్చితంగా చేప ప్రసాదంగానే వ్యవహరించాలని ఆదేశించాయి. దీనితో పాటు, పంపిణీ కేంద్రాల వద్ద ఇది ఆస్తమాను నయం చేసే ఔషధం కాదని పెద్ద అక్షరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని నిర్దేశించాయి. ఇటువంటి నిబంధనలు విధిస్తున్నా, పంపిణీ సమయంలో పారిశుధ్య నియమాలను పాటించడం అనేది మరొక సవాలుగా నిలుస్తుంది. ప్రత్యక్షంగా చేతులు కడుక్కోవడం వంటి కనీస జాగ్రత్తలు పాటించకపోతే, ఇన్ఫెక్షన్లు వ్యాపించే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించడం కూడా హేతువాదుల విమర్శలకు కారణమవుతోంది. పంపిణీ కేంద్రాలకు అవసరమైన స్థలాన్ని కేటాయించడం, లక్షలాది చేప పిల్లలను మత్స్య శాఖ ద్వారా ఉచితంగా అందించడం, రవాణా, ఇతర బస ఏర్పాట్లను నిర్వహించడం కోసం ప్రజాధనాన్ని ఖర్చు చేయడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అయినప్పటికీ, మూఢనమ్మకాలకు పరోక్షంగా మద్దతు ఇవ్వడం విచారకరమైన విషయం. పన్ను చెల్లింపుదారుల డబ్బును ఇటువంటి వ్యక్తిగత నమ్మకాలతో కూడిన ఆచారాలకు వెచ్చించడం కన్నా, ప్రజల ఆరోగ్యం కోసం శాస్త్రీయ వైద్య సదుపాయాలను మెరుగుపరచడం ఎంతో ఉత్తమమైన మార్గం. జీవహింస అంశం కూడా ఈ వివాదంలో ఒక ముఖ్య భాగం. చిన్న చేప పిల్లలను ప్రాణంతోనే మింగించడం అనేది జంతు ప్రేమికుల మనోభావాలను దెబ్బతీసే చర్యగా మారుతోంది. మూగజీవాలను ఇష్టానుసారంగా ఉపయోగించడం ఎంతవరకు నైతికమో, పర్యావరణ స్పృహ కలిగిన ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. ఆరోగ్య పరిరక్షణ పేరుతో జరిగే ఈ చర్యలు శాస్త్రీయత లేనివి మాత్రమే కాకుండా, అశాస్త్రీయ పద్ధతులను సమాజంలోకి బలంగా తీసుకువెళ్లేలా ఉన్నాయి. ఆధునిక కాలంలో, అద్భుతాల కోసం ఎదురుచూసే కన్నా, నిరూపితమైన వైద్య విధానాలను ఆశ్రయించడం శ్రేయస్కరం. మందులు, ఆపరేషన్ల ద్వారా నయం చేయగల వ్యాధులను, ఇలాంటి మూలికా ఆచారాలతో తగ్గించుకోవాలని చూడటం ప్రాణాలకే ప్రమాదకరం. ఈ చేప ప్రసాదం కార్యక్రమం కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు, ఇది సమాజంలోని అశాస్త్రీయతకు అద్దం పట్టే ఒక సంఘటన. ఒక వ్యక్తి వందల ఏళ్ల క్రితం చెప్పిన మాటను, ఎటువంటి ఆధునిక పరిశోధన లేకుండానే లక్షలాది మంది నమ్ముతున్నారు అంటే, ప్రజల్లో శాస్త్రీయ అవగాహన ఎంత తక్కువగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వైద్యశాస్త్రం, ఫార్మాస్యూటికల్ పరిశోధనలు ఊపిరితిత్తుల వ్యాధులను నియంత్రించేందుకు కఠినమైన క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తాయి. కనీసం అటువంటి ప్రాథమిక పరీక్షలు కూడా చేయించుకోని ఈ చేప ప్రసాదం వెనుక ఉన్న నమ్మకాలను వదులుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. శాస్త్రబద్ధమైన విజ్ఞానం అందించే ఫలితాలే శాశ్వతమైనవి. మృగశిర కార్తె వచ్చినప్పుడు చేపలు తినడం వెనుక ఉన్న ఆరోగ్య ప్రయోజనాలను శాస్త్రం సమర్థిస్తుంది. కానీ, చేపను ఒక ఔషధంగా భావించి నోటిలో మందు పెట్టి మింగడం అనేది విజ్ఞాన శాస్త్రానికి విరుద్ధం. మృగశిర కార్తెలో చేపలు తినడం ద్వారా శరీరానికి తగినంత వేడి, ప్రోటీన్లు అందుతాయి. సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు సమతుల్య ఆహారం తీసుకోవడం సరైన పద్ధతి. అయితే, ఇక్కడ చేపను పౌష్టికాహారంగా కాకుండా ఒక మంత్రౌషధంగా చూపడం వల్ల అమాయక ప్రజలు తప్పుదోవ పడుతున్నారు. ఈ వ్యత్యాసాన్ని గుర్తించి, ప్రజలు మూఢనమ్మకాల నుంచి బయటపడాల్సిన అవసరం ఉంది. ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు డాక్టర్లను సంప్రదించడమే సరైన మార్గం. హేతువాదుల పోరాటం ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటుంది. శాస్త్ర సాంకేతిక రంగం ఎంత అభివృద్ధి చెందినప్పటికీ, సమాజంలో ఇటువంటి అశాస్త్రీయ అంశాలు జీవించే ఉంటాయి. కానీ, వీటిని ప్రశ్నించే గొంతులు ఉన్నంత కాలం మార్పు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ 176 ఏళ్ల ఆచారం, దీని వెనుక ఉన్న వివాదాలు, కోర్టు తీర్పులు ఇవన్నీ ఒకవైపు ఉంటే, శాస్త్రీయంగా నిరూపించబడని ఏ అంశాన్ని కూడా ఆరోగ్యకరమైన చికిత్సగా పరిగణించకూడదు. ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరిగే ఈ కార్యక్రమం రాబోయే రోజుల్లో ఆగిపోవాలి. సైన్స్ ప్రతిపాదించే ఆధారిత వైద్యం, నమ్మకాలతో కూడిన అశాస్త్రీయ పద్ధతులపై ఎప్పుడూ విజయం సాధించాలి. ఆరోగ్యమే మహా భాగ్యం అనుకునే వారు అశాస్త్రీయ మార్గాలను ఎంచుకోకూడదు. ఈ చర్చలో గెలుపు ఎవరిదో కాలమే నిర్ణయిస్తుంది. అయితే, శాస్త్రీయ దృక్పథం కలిగిన సమాజం వైపు ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలి. మూఢనమ్మకాలకు తావులేకుండా, ఆరోగ్య సంరక్షణ కోసం సైన్స్ అందించే ఫలాలను స్వీకరించడం ప్రతి పౌరుడి బాధ్యత. బత్తిని కుటుంబం చేప ప్రసాదాన్ని పంపిణీ చేయవచ్చు, ప్రజలు వెళ్లవచ్చు, కానీ అది ఒక మూఢనమ్మకం మాత్రమేనని గుర్తించి నడుచుకోవడం మేధావుల లక్షణం. ఇటువంటి పద్ధతుల వల్ల కాలయాపన జరగడమే తప్ప వ్యాధులు నయం కావు. అబద్ధపు ప్రచారాలను నమ్మి విలువైన సమయాన్ని, ఆరోగ్యాన్ని పణంగా పెట్టకండి. విజ్ఞాన శాస్త్రమే మనకు దిక్సూచిగా ఉండాలి. అశాస్త్రీయ ఆచారాలకు స్వస్తి పలికి, ఆధునిక వైద్య ప్రగతిని గౌరవించడం ద్వారానే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోగలం.



## పోక్సో కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

- మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో కఠిన తీర్పు
- రూ. లక్ష పరిహారం.. రూ.6 వేల జరిమానా విధించిన కోర్టు
- చిన్నారులపై నేరాలకు పాల్పడితే కఠిన శిక్ష తప్పదు : ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్‌లోని ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించినట్లు హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. మేఘావత్ శ్రీకాంత్ (25), బస్సు డ్రైవర్, ఓ మైనర్ బాలికను మోసపూరితంగా నమ్మించి లైంగికంగా దుర్వినియోగం చేసిన ఘటనపై 2019లో హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నెం.638/2019 కింద ఐపీసీ సెక్షన్లు 417, 376తో పాటు పోక్సో చట్టం సెక్షన్ 4 కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాధారాలు, బాధితురాలి వాంగ్మూలం, వైద్య నివేదికలు మరియు ఇతర ఆధారాలను పరిశీలించిన కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.6,000 జరిమానా విధించింది. అదేవిధంగా బాధితురాలికి రూ.1 లక్ష బాధిత పరిహారం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసును అప్పటి హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె. సతీష్ కుమార్ సమర్థవంతంగా దర్యాప్తు చేసి పటిష్టమైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టడం ద్వారా నిందితుడికి శిక్ష పడేలా కీలక పాత్ర పోషించినట్లు నాగరాజు గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో పోలీసు శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. పోక్సో కేసుల్లో నిందితులను చట్టం ముందు నిలబెట్టి శిక్షించే వరకు దర్యాప్తును పకడ్బందీగా నిర్వహిస్తాం.

## వృద్ధుడికి ప్రాణదాతగా మారిన కానిస్టేబుల్ అనిత

- చేపల వేటలో ప్రమాదం.. బురదలో చిక్కుకున్న వృద్ధుడు
- కేకలు విన్న వెంటనే స్పందించిన మహిళా కానిస్టేబుల్
- ప్రమాదాన్ని లెక్కచేయకుండా బురదలోకి దిగిన కానిస్టేబుల్ అనిత



**కురవి, విశాలభారతి:** చెరువులో చేపల వేట సందర్భంగా ప్రమాదవశాత్తు బురదలో చిక్కుకున్న ఓ వృద్ధుడిని కురవి పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ అనిత సాహసోపేతంగా రక్షించి మానవత్వాన్ని చాటారు. ప్రమాదాన్ని లెక్కచేయకుండా ఆమె చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి స్థానికులను ఆకట్టుకోగా, ఆమె సేవలను ప్రజలు కొనియాడుతున్నారు. సోమవారం కురవి చెరువులో నీటి మట్టం తగ్గడంతో చేపల వేట కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఈ క్రమంలో చెరువు మధ్య భాగంలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వృద్ధుడు ఒక్కసారిగా బురదలో కూరుకుపోయాడు. ఎంత ప్రయత్నించినా బయటకు రాలేకపోవడంతో అతను సహాయం కోసం కేకలు వేశాడు. బురద మరింత లోతుగా ఉండటంతో అక్కడున్న వారిలో ఆందోళన నెలకొంది. సమాచారం అందుకున్న కురవి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ అనిత వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని పరిశీలించిన ఆమె క్షణం ఆలస్యం చేయకుండా సహాయక చర్యలు ప్రారంభించారు. బురదలోకి దిగడం ప్రమాదకరమని తెలిసినా వెనుకడుగు వేయకుండా ముందుకు సాగారు. స్థానిక యువకుల సహకారంతో వృద్ధుడిని పట్టుకుని నెమ్మదిగా బయటకు తీసుకొచ్చారు. దీంతో అక్కడున్న ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమయంలో చాలామంది భయంతో వెనుకంజ వేసిన చోట కానిస్టేబుల్ అనిత మాత్రం అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించి ఓ ప్రాణాన్ని కాపాడారని స్థానికులు ప్రశంసిస్తున్నారు. పోలీసు విధులు అంటే కేవలం శాంతిభద్రతల పరిరక్షణ మాత్రమే కాదని, అవసరమైన సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటమూ తమ బాధ్యతేనని అనిత తన చర్యతో నిరూపించారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆమె చూపిన సేవా తత్వం, అంకితభావం, మానవత్వం పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాయని అన్నారు.

## బంచరాయితండలో గ్రామసభ నిర్వహణ

- వ్యవసాయం నుంచి విపత్తు నిర్వహణ వరకు పలు కీలక అంశాలపై అవగాహన.



**కురవి విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండ గ్రామ పంచాయతీలో సోమవారం గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ సభ సర్పంచ్ బాదావత్ కల్లి పుల్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రాజేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా వ్యవసాయ పంటల మార్పిడి విధానాల ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించడంతో పాటు నేల సారాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. అలాగే మహిళల భద్రత, స్త్రీ సంక్షేమ కార్యక్రమాలు, వర్షాకాల సన్నద్ధత చర్యలు, గ్రామ శానిటేషన్ నిర్వహణ, సైడ్ డ్రెయిన్‌ల నిర్మాణం మరియు పూడికతీత పనుల ప్రాధాన్యతను వివరించారు. గ్రామ పరిసరాల్లో పెరిగిన పొదలను తొలగించడం, తాగునీటి సమస్యలు పరిష్కరించడం, జల సంరక్షణ చర్యలు చేపట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. "జల సంరక్షణ - మన సంరక్షణ" అనే నినాదంతో నీటి వనరుల పరిరక్షణకు గ్రామస్థులు కృషి చేయాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రామంలో చెట్లు, మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. అదేవిధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం, రోడ్డు భద్రతా నిబంధనల పాటింపు, మాదకద్రవ్యాల నిర్మూలన (నో డ్రగ్స్)పై అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విపత్తు నిర్వహణ చర్యలపై కూడా గ్రామస్థులకు సూచనలు అందించారు. ఈ గ్రామసభలో ఉపసర్పంచ్ కల్పన భరత్, పంచాయతీ కార్యదర్శి ఉష, ఏ.ఈ.ఓ పూజిత, జిపిఓ నిర్మల, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రంజిత్, రామారావు, భరత్, వార్డు సభ్యులు ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించి ప్రజల అభిప్రాయాలు, సమస్యలను అధికారులు తెలుసుకొని పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## ఎస్పీ చేతుల మీదుగా రివార్డు అందుకున్న ఎస్సై



**మరిపెడ విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా పోలీసు శాఖలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన నరసింహులపేట ఎస్సై బానోతు వెంకన్నకు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ రివార్డు అందజేశారు. పోలీసు విధుల్లో నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేసినందుకు గుర్తింపుగా ఈ రివార్డును ఎస్పీ తన చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకన్నను ఎస్పీ అభినందించి, భవిష్యత్తులో కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.పోలీసు సిబ్బంది ఎస్సై వెంకన్నకు శుభాకాంక్షలు తెలిపారు.

## స్కాలర్‌షిప్‌లో ప్రతిభ చాటిన మరిపెడ విద్యార్థిని



**మరిపెడ విశాలభారతి:** టీజీ మోడల్ స్కూల్, మరిపెడలో 8వ తరగతి చదువుతున్న ఎం. రీటా రాణి, శ్రీ ఎం. భాస్కర్ మరియు శ్రీమతి సుధారాణి దంపతుల కుమార్తె, ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)-2025 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి విశేష ప్రతిభ కనబరిచింది. ఈ విజయంతో ఆమెకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయ్యే వరకు ప్రతి సంవత్సరం రూ.12,000 చొప్పున ఉపకార వేతనం అందనుంది. పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థులను ఉన్నత విద్యాభ్యాసానికి ప్రోత్సహించే ఈ ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్‌ను సాధించడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. విద్యార్థిని సాధించిన ఈ ఘన విజయానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. అలాగే విద్యార్థిని తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## తాళ్ల ఊకల్ ఐకేపీ కేంద్రంలో అక్రమాల కలకలం

- జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రైతుల ఆందోళన

**మరిపెడ విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తాళ్ల ఊకల్ గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఐకేపీ కేంద్రంలో రైతుల నుంచి అక్రమ వసూళ్లు చేస్తున్నారని, వడ్ల తూకాల్లో అవకతవకలకు పాల్పడుతున్నారని రైతులు తీవ్ర ఆరోపణలు చేశారు. రైతుల కథనం ప్రకారం, ధాన్యం విక్రయించేందుకు కేంద్రానికి తీసుకువెళ్లినప్పుడు ప్రతి దశలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు చెల్లించని రైతుల వడ్లకు కాంటా పెట్టడం లేదని వాపోయారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటూ రోజుల తరబడి కేంద్రం వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో పారదర్శకత లేకపోవడం, తూకాల్లో తేడాలు ఉండడం వల్ల రైతులకు ఆర్థిక నష్టం జరుగుతోందని వారు ఆరోపించారు. కొందరు రైతులు తమ ధాన్యానికి సరైన బరువు నమోదు చేయడం లేదని, ఉద్దేశపూర్వకంగా కోతలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బాధిత రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను వివరించారు. ఐకేపీ కేంద్రంలో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి, రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుల ఫిర్యాదులపై అధికారులు స్పందించి విచారణ జరిపి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రైతుల కష్టార్జిత పంటకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. "రైతు చెమటతో పండించిన ధాన్యానికి ధర రావాలి గానీ, ప్రతి అడుగులో లంచాలు చెల్లించే పరిస్థితి ఉండకూడదు" అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారగా, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై రైతులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# సిరిసిల్లలో ఇసుక భూతం!

**మొదటిపేజీ తరువాయి**




కొట్టించడంలో ఈ మాఫియా సిద్ధహస్తులుగా వ్యవహరించింది. జీపీఎస్, ఆన్‌లైన్ ట్రాకింగ్ వ్యవస్థల పరిధిలోకి రాకుండా వాహనాలను నడిపి నిఘా కళ్లు గప్పారు. నిబంధనల ప్రకారం నదిలో 3 మీటర్ల లోతు వరకే ఇసుక తవ్వకాలకు అనుమతి ఉండగా, భారీ యంత్రాలతో 25 నుండి 30 అడుగుల లోతు వరకు తవ్వకాలు జరిపారు. దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి సమీప గ్రామాల్లోని బావులు ఎండిపోయాయని ఎన్జీటీ, కాగ్ నివేదికలు గతంలోనే తీవ్రంగా తప్పుబట్టాయి. మైనింగ్ దోపిడీ వల్ల జిల్లాలో దాదాపు 700 కొండలు మాయమైపోయాయని, పర్యావరణం తీవ్రంగా దెబ్బతిందని పర్యావరణ వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఇసుక మాఫియా వెనుక ఉన్న రాజకీయ అండదండల వ్యవహారంపై సీఐడీ ఇప్పుడు ప్రత్యేక నిఘా పెట్టింది. 2014 నుంచి 2026 మధ్య కాలంలో జరిగిన మైనింగ్ అక్రమాలపై సమగ్ర దర్యాప్తులో భాగంగా మైనింగ్ శాఖ తన ప్రాథమిక నివేదికను సీఐడీకి అందించింది. ఈ నివేదిక ఆధారంగా అక్రమార్కుల జాబితాను సిద్ధం చేస్తున్న దర్యాప్తు సంస్థ కీలక సూత్రధారులను గుర్తించే పనిలో ఉంది. విచారణలో ఓ మాజీ ఎంపీతో పాటు అప్పటి ప్రభుత్వంలోని కీలక పెద్దల పాత్ర బయటపడితే చట్టపరమైన ఉచ్చు బిగుసుకోవడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని దర్యాప్తు బృందాలు సంకేతాలు ఇస్తున్నాయి. ముగ్గురు మాజీ మంత్రులు టార్గెట్‌గా ప్రస్తుతం విచారణ సాగుతోందనే చర్చ రాష్ట్రవ్యాప్తంగా జోరుగా సాగుతోంది. ఫెమా నిబంధనల ఉల్లంఘన, 750 కోట్ల రూపాయల పన్ను ఎగవేత వంటి తీవ్ర ఆరోపణల నేపథ్యంలో గత పాలకులు నోటీసులను తొక్కిపెట్టారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, రాజకీయ ఒత్తిళ్లకు లోబడే ప్రసక్తే లేదని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. సేకరించిన ఆధారాలను విశ్లేషిస్తూ అప్పటి ప్రభుత్వ పెద్దలకు నోటీసులు జారీ చేసేందుకు సీఐడీ సిద్ధమవుతోంది. ఇసుక మాఫియా వెనుక ఉన్న బడా నేతల బండారం త్వరలోనే బయటపడే అవకాశం ఉంది. ఈ దందా వల్ల గతంలో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేరేళ్ల ఘటనను రాజకీయ వర్గాలు ఇప్పుడు మళ్లీ గుర్తు చేసుకుంటున్నాయి. అక్రమ ఇసుక రవాణాను ప్రశ్నించిన నేరేళ్ల గ్రామస్తులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అప్పట్లో దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఈ ఇసుక వ్యవహారం కారణంగా అప్పట్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాజకీయంగా గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సిరిసిల్ల నియోజకవర్గంలో సాగిన ఇసుక అక్రమాలు, నేరేళ్ల ఘటన స్థానికంగా ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను తీసుకువచ్చాయి. ఇది కేటీఆర్ ఇమేజ్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపిందని అప్పట్లో విస్తృత ప్రచారం జరిగింది. నేరేళ్ల ఘటన కేవలం పోలీసుల చర్యగా కాకుండా రాజకీయ అహంకారానికి నిదర్శనమని అప్పట్లో ప్రతిపక్షాలు విమర్శించాయి. బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, రక్షణ కల్పించిన వారిపైనే కేసులు నమోదు చేయడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఇప్పుడు అదే ఇసుక దందా మరోసారి వెలుగులోకి రావడం, దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగడంతో ఆనాటి ఘటనకు సంబంధించిన కీలక ఆధారాలు సేకరించే పనిలో సీఐడీ ఉంది. బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఇప్పుడు స్థానికుల్లో వ్యక్తమవుతోంది. అక్రమార్కులను కఠినంగా శిక్షించాలనే డిమాండ్ ప్రజల నుండి బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తు సిరిసిల్ల కేంద్రంగా సాగిన ఇసుక అక్రమాలకే పరిమితం కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మైనింగ్ దందాపై ఒక సంకేతాన్ని పంపుతోంది. ప్రభుత్వ సంపదను దోచుకున్న వారిని వదిలిపెట్టేది లేదని స్పష్టమవుతోంది. రాజకీయ రంగు ఉన్నప్పటికీ నేరస్తుల మీద కఠిన చర్యలు తీసుకోవాలని సివిల్ సమాజం కోరుతోంది. దశాబ్ద కాలంగా జరిగిన దోపిడీకి ఇప్పుడు జవాబుదారీతనం మొదలైందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. సీఐడీ విచారణ తర్వాత మరిన్ని విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమాలను అరికట్టడంలో మైనింగ్ శాఖ విఫలమైందనే వాదన బలంగా ఉంది. అధికారులకు తెలిసినా కూడా రాజకీయ ఒత్తిళ్ల వల్ల మౌనంగా ఉన్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో అధికారుల ధైర్యం పెరిగింది. అక్రమాల చిట్టాను బయటపెట్టే క్రమంలో వారు సీఐడీకి సహకరిస్తున్నారు. నిబంధనలను అతిక్రమించిన ప్రతి ఒక్కరి మీద చట్టపరమైన కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధమైంది. అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. చివరికి, ఈ మైనింగ్ అక్రమాల దర్యాప్తు ఏ మలుపు తిరుగుతుందో చూడాలి. కేవలం రాజకీయ ప్రతీకారం కాకుండా, చట్టం ముందు అందరూ సమానమేనని నిరూపించే దిశగా విచారణ సాగుతోంది. నేరేళ్ల ఘటన నుండి నేటి ఇసుక దందా వరకు జరిగిన ప్రతి అడుగును దర్యాప్తు బృందాలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ కేసు ఎంతటి సంచలనాలకు దారితీస్తుందో వేచి చూడాల్సిందే. 750 కోట్ల పన్ను ఎగవేత వ్యవహారం ఏ స్థాయి నేతలను బలి తీసుకుంటుందోనని ఉత్కంఠ నెలకొంది.

## అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం



- లింగ నిర్ధారణ పరీక్షలపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్ విశాలభారతి:**

జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న "మన ఇసుక వాహనం" పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇసుకను పారదర్శకంగా అందించాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. అలాగే లింగ నిర్ధారణ పరీక్షలు, అక్రమ గర్భస్రావాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్‌తో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ఇసుక రీచ్‌ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇసుక సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణా నియంత్రణ, "మన ఇసుక వాహనం" పథకం సమర్థవంతమైన అమలుకు జిల్లా స్థాయి ఇసుక టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలో ఆర్డీవో, సహాయ గనుల శాఖ అధికారి, పోలీసు శాఖ, పరిశ్రమల శాఖ, రవాణా శాఖ తదితర విభాగాల అధికారులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. ఇసుక రవాణా ఉదయం వేళల్లో మాత్రమే జరిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో అక్రమ స్కానింగ్ కేంద్రాలు, లింగ నిర్ధారణ పరీక్షలు, చట్టవిరుద్ధ గర్భస్రావాలపై గట్టి నిఘా అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. మాతా శిశు మరణాలను తగ్గించేందుకు వైద్య శాఖ మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఆసుపత్రుల తనిఖీల సమయంలో నిబంధనల అమలు, అర్హత కలిగిన వైద్యుల అందుబాటు, వైద్య సేవల ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ అనుమతుల కోసం వచ్చే ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దరఖాస్తులను తిరస్కరించాలని ఆదేశించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, ప్రైవేట్ క్లినిక్‌లలో అగ్నిమాపక భద్రత, తాగునీరు, పార్కింగ్, సిబ్బంది వివరాలు తదితర మౌలిక వసతులను చెక్‌లిస్ట్ ప్రకారం తనిఖీ చేయాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు, అక్రమ గర్భస్రావాలు, బాల్య వివాహాల దుష్పరిణామాలపై గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. చట్టాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ* జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ప్రాథమిక వైద్యుల ద్వారా సమాచార సేకరణ చేపట్టి లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. అలాగే అక్రమ ఇసుక రవాణా, మందుల దుకాణాల కార్యకలాపాలపై ప్రత్యేక విభాగాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, తొర్రూరు ఆర్డీవో గణేష్, తహసీల్దార్లు, సహాయ గనుల శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, పోలీసు శాఖ అధికారులు, న్యాయ విభాగం ప్రతినిధులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నక్ష పైలట్ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయాలి

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు ఆదేశం**

**మహబూబాబాద్ విశాల భారతి**




రాష్ట్రంలో పారదర్శక భూపరిపాలన వ్యవస్థను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన నక్ష (పట్టణ భూముల హద్దుల గుర్తింపు) పైలట్ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. భూముల రీసర్వే, పట్టణ భూముల హద్దుల గుర్తింపు (నక్ష) కార్యక్రమాల పురోగతిపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆయన సమీక్షించారు. రాష్ట్రంలో వివాదాలు లేని, ప్రజలకు నమ్మకాన్ని కలిగించే భూ రికార్డుల వ్యవస్థను తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ దిశగా డిజిటల్ సర్వే కార్యక్రమాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. నక్ష పైలట్ ప్రాజెక్టులకు ఎంపికైన జిల్లాల్లో సర్వే, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి రోవర్ పరికరాల సహాయంతో క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ఆస్తులకు ఖచ్చితమైన సర్వే నిర్వహించి, రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్) నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్, సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ, నక్ష పైలట్ ప్రాజెక్టు కింద మహబూబాబాద్ మున్సిపాలిటీ ఎంపికైందని తెలిపారు. ప్రాజెక్టు అమలులో భాగంగా సర్వే, రెవెన్యూ శాఖల ద్వారా క్షేత్రస్థాయిలో సర్వే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఆర్ఓఆర్ నమోదు ప్రక్రియ ప్రారంభానికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రెవెన్యూ వార్డులను బ్లాక్‌లుగా విభజించి ఆస్తుల గుర్తింపు, సర్వే, డిజిటలైజేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నిర్దేశిత గడువులో నక్ష ప్రాజెక్టు లక్ష్యాలను పూర్తి చేసి ప్రజలకు పారదర్శకమైన భూ రికార్డులను అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, రాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్, ఏడి సర్వేతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హయత్‌నగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలి : ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సూర్యనగర్ కాలనీలో సుమారు 50 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించినట్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీకి తరలించినట్లు వెల్లడించారు. గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ కోరారు.

## 'ఉరివేసుకుంటా' అంటూ వీడియో పంపి అదృశ్యమైన డ్రైవర్

- హయత్‌నగర్‌లో మిస్సింగ్ కేసు నమోదు.. దర్యాప్తు చేపట్టిన పోలీసులు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** ఆత్మహత్య చేసుకుంటానంటూ కుటుంబ సభ్యులకు వీడియోలు పంపిన అనంతరం ఓ యువకుడు అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కోహెడ గ్రామానికి చెందిన దర్జి జయంత్ (24), వృత్తిరీత్యా డ్రైవర్, జూన్ 6న పనికి వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అనంతరం జూన్ 8న తన మొబైల్ ఫోన్ నుంచి కుటుంబ సభ్యులు, బంధువులకు తాను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు సూచించే వీడియోలు పంపించాడు. వీడియోలు అందిన తర్వాత కుటుంబ సభ్యులు జయంత్ కోసం గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో అతని భార్య కల్వంద పూజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు క్రైం నెం. 979/2026 కింద మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. యువకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు, అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు.

## అక్రమ గ్యాస్ నిల్వలపై ఉక్కుపాదం

- కరీంగూడలో 53 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం
- నిందితుడు ఏనుగు జంగారెడ్డినీ అరెస్ట్ చేసిన అధికారులు



**కీసర,విశాలభారతి :** నాగారం డివిజన్ కరీంగూడలో సోమవారం అక్రమంగా డొమెస్టిక్ గ్యాస్లను నిలవ ఉంచి సప్లై చేస్తున్న 53 కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న ఎన్ఫోర్స్మెంట్ అధికారులు. అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఏనుగు జంగారెడ్డిని సైతం అరెస్టు చేశారు.అధికారులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు కీసర మండలంలోని కరీంగూడలో అక్రమంగా గ్యాస్ సిలిండర్ల నిల్వ, విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ బృందం తనిఖీలు చేపట్టింది. ఈ దాడుల్లో సుమారు 53 కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డీఎస్పీ రమేశ్ రెడ్డి మాట్లాడుతూ గృహ, వాణిజ్య అవసరాలకు సంబంధించిన గ్యాస్ సిలిండర్లను అనుమతులు లేకుండా నిల్వ ఉంచడం,విక్రయించడం చట్ట విరుద్ధమని తెలిపారు. ప్రజల భద్రతకు ప్రమాదం కలిగించే ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.చాలా వరకు భారత్ గ్యాస్ కంపెనీకి చెందిన గ్యాస్ సిలిండర్లు ఉన్నట్లు గుర్తించాము అని తెలిపారు.సదరు భారత్ గ్యాస్ ఏజెన్సీని సైతం విచారిస్తాం అని అన్నారు.అక్రమ గ్యాస్ నిల్వలు, విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే ప్రజలు వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు.డీఎస్పీ రమేశ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో నార్రా ప్రభాకర్, పోలీస్ కానిస్టేబుల్, ఏపీఓ రమణ పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో హరితహారం కార్యక్రమం



**పాల్వంచ: విశాలభారతి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), పాల్వంచలో నిర్వహిస్తున్న ఐసీఎస్ఎస్ఆర్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం సోషల్ సైన్సెస్ డీన్, ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి కళాశాలను సందర్శించారు.ఈ సందర్భంగా ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత మరియు పచ్చదనం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. పద్మ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి, సెస్స్ ఐసీఎస్ఎస్ఆర్ పోస్ట్‌డాక్టరల్ ఫెలో డా. వి. మల్లికార్జున్ నాయక్, అధ్యాపక బృందం కలిసి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్య సమస్యలను ఎదుర్కోవాలంటే మొక్కల పెంపకం, హరితహారం కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో పర్యావరణ అవగాహన పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, ఐసీఎస్ఎస్ఆర్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా గిరిజన విద్యార్థుల హిందీ భాషా నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక చర్చ నిర్వహించారు.

## ఉచిత కర్రసాము శిక్షణా శిబిరం సమారోపం



**రాజేంద్రనగర్, విశాలభారతి :** ద్వారా ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ నీరుడు పవన్ సాయి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కర్రసాము శిక్షణా శిబిరం సమారోప ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రముఖులు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు కర్రసాము ప్రదర్శనలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ నీరుడు పవన్ సాయి మాట్లాడుతూ, యువతలో ఆత్మరక్షణ నైపుణ్యాలు పెంపొందించేందుకు ఈ శిబిరం ఎంతో ఉపయోగపడిందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అతిథులు మాట్లాడుతూ, యువత శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ధైర్యం పెంపొందించుకోవడానికి ఇలాంటి శిక్షణలు అవసరమని పేర్కొన్నారు. శిబిరంలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## నెక్నాంపూర్ పెద్ద చెరువు సుందరీకరణకు కృతజ్ఞతలు

**చిన్న చెరువు అభివృద్ధికి వినతి**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** మణికొండ 127, 128 డివిజన్ల కాంగ్రెస్ నాయకులు నెక్నాంపూర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులను ప్రారంభించినందుకు హైడ్రా కమిషనర్ శ్రీ రంగనాథ్ ఐపీఎస్ గారిని కలిసి డివిజన్ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా, నెక్నాంపూర్ చిన్న చెరువు వద్ద సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రారంభించిన డ్రైనేజ్ డైవర్షన్ పనులను కమిషనర్‌కు వివరించారు. అలాగే, చిన్న చెరువును కూడా సుందరీకరణ చేయాలని కోరుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ కస్తూరి నరేందర్ గారు రాసిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఇక 127 డివిజన్ మణికొండ ఎల్లమ్మ చెరువు వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి కాపాడి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు జితేందర్, కిరణ్ కుమార్, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, మైనారిటీ నాయకుడు షేక్ హాజీ తదితరులు పాల్గొన్నారు.

## భార్య మృతిని తట్టుకోలేక భర్త ఆత్మహత్య



**రాజేంద్రనగర్, విశాలభారతి :** శంషాబాద్ మండలంలోని గొల్లపల్లి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. భార్య మృతిని తట్టుకోలేక భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. గొల్లపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ (35), వృత్తి రీత్యా సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ ఉండేవాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేక అతను తన అన్న వినోద్ కుమార్‌తో కలిసి రెండు సంవత్సరాల క్రితం దుబాయ్‌కు వెళ్లాడు. అయితే, ఈ ఏడాది మార్చి 2న శ్రీకాంత్ భార్య స్వప్న (36) ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఈ సమాచారం అందుకున్న వెంటనే శ్రీకాంత్, వినోద్ కుమార్‌లు జూన్ 3న దుబాయ్ నుంచి స్వగ్రామానికి చేరుకున్నారు. జూన్ 6న స్వప్నకు సంబంధించిన దినవారాలు నిర్వహించారు. అనంతరం జూన్ 7న రాత్రి శంషాబాద్ సమీపంలోని సిద్ధుల గుట్టకు వెళ్లి, జూన్ 8 ఉదయం ఇంటికి తిరిగి వచ్చారు. అదే రోజు ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన అనంతరం, శ్రీకాంత్ తన గదికి వెళ్లి విశ్రాంతి తీసుకుంటానని చెప్పాడు. కొంతసేపటికి అతని అన్న ఫోన్ చేయగా స్పందించలేదు. అనుమానం వచ్చి గదికి వెళ్లి చూడగా తలుపు లోపల నుంచి వేసుకుని ఉంది. తలుపు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా, శ్రీకాంత్ గదిలో పైకప్పుకు ఉన్న ఇనుప పైపుకు చీరతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించి చూడగా అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించారు. భార్య ఆత్మహత్యతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీకాంత్ అదే కారణంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. ఈ ఘటనపై ఎవరిపై కూడా అనుమానం లేదని వారు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుడికి వెళ్తానని వెళ్లిన విద్యార్థి అదృశ్యం

**అబ్దుల్లాపూర్‌మెట్‌లో మిస్సింగ్ కేసు నమోదు.. దర్యాప్తు చేపట్టిన పోలీసులు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** పుట్టినరోజు సందర్భంగా గుడికి వెళ్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం గ్రామానికి చెందిన మండల్ వివేక్ (21), విద్యార్థి, జూన్ 7వ తేదీ ఉదయం సుమారు 7 గంటల సమయంలో తన పుట్టినరోజు సందర్భంగా గుడికి వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. బంధువులు, స్నేహితుల వద్ద గాలించినప్పటికీ యువకుడి ఆచూకీ లభించకపోవడంతో అతని సోదరుడు సుభోజిత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. యువకుడి ఆచూకీ కోసం ప్రత్యేక దృష్టి సారించినట్లు ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. సెల్‌ఫోన్ కాల్ డేటా, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తున్నామని, అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని, యువకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి వెల్లడించారు.

## బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సమావేశం విజయవంతం

- **డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**
- **మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**



**మొయినాబాద్, విశాలభారతి:** చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో గల పి.వి. కన్వెన్షన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పార్టీ బలోపేతానికి డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని, ప్రతి నాయకుడు, కార్యకర్త దీనిని బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు సరైన అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు.ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని ఆమె పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు సభ్యత్వ నమోదు కార్యక్రమానికి దిశానిర్దేశం చేసినట్లు నాయకులు తెలిపారు.

## నాలాల పూడికతీత పనులు ప్రారంభం!



**సికింద్రాబాద్, విశాలభారతి :** గతవారం కాంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తిహర్షకిరణ్ జోనల్ కమిషనర్ మంగతాయరు ని కలిసి, వారాసిగూడలోని నాలాల డీసిల్టేషన్ చేయవలసిందిగా ఇచ్చిన అభ్యర్థనపై జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి సోమవారం నాలాల పూడికతీత పనులు ప్రారంభించారు. డివిజన్ నాయకులతో కలిసి మేకల కీర్తి హర్షకిరణ్ క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి, సమీక్షించారు. నాలాల నుండి తీసిన వ్యర్థాలను రోడ్లపైనే వదిలేయకుండా, స్థానికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కేవలం రెండు రోజుల్లోనే పూర్తిగా క్లియర్ చేయాలని ఏ ఈ వేణు కి సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు భిక్షపతి, యాదమ్మ, మమత ,ప్రమీల మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణలో విద్య పేరుతో దోపిడీ రాజ్యం!

- **ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దందాపై భగ్గుమన్న విద్యార్థి సంఘ నేతలు**
- **విద్యను వ్యాపార వస్తువుగా మార్చిన కార్పొరేట్ స్కూళ్లు.**
- **ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది?**
- **ఫీజు నియంత్రణ కమిటీ లేకపోవడంతో విచ్చలవిడిగా పెరుగుతున్న ప్రైవేట్ స్కూల్ ఫీజులు**
- **ఫీజుల పేరిట తల్లిదండ్రుల జేబులకు చిల్లులు.. విద్యా సంస్థల ఇష్టారాజ్యం!**
- **ఫీజుల నియంత్రణకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి:**
- **"స్కూలా..? షాపింగా..? ఫీజుల మోతతో విలవిల్లాడుతున్న తల్లిదండ్రులు!"**
- **"పిల్లల చదువు బంగారమైపోయింది.. సామాన్యుడికి విద్య అందనంత దూరం!"**
- **"విద్య పేరుతో దోపిడీ.. ప్రభుత్వం మౌనం ఎందుకు?"**
- **ప్రైవేట్ విద్యా మాఫియాపై చర్యలు ఎప్పుడూ..?"**
- **పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్, డీఎస్ఎఫ్ఐ నాయకుడు గుగులోతు శివవర్మ నాయక్**








**మహబూబాబాద్ విశాలభారతి;**

తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నేడు ప్రమాదకర మలుపు తిరిగిందని, విద్య హక్కుగా కాకుండా వ్యాపార వస్తువుగా మారిపోయిందని పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్, డీఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకుడు గుగులోతు శివవర్మ నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల పేరుతో తల్లిదండ్రుల రక్తాన్ని పీలుస్తున్నాయని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దుతామని చెప్పే ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు, వాస్తవానికి తల్లిదండ్రుల జేబులను ఖాళీ చేసే వ్యాపార కేంద్రాలుగా మారాయని ఆరోపించారు. ప్రభుత్వం నిశ్చేష్టంగా చూస్తూ ఉండటం వల్ల వేలాది కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతున్నాయని విమర్శించారు.

**విద్య హక్కు కాదు... డబ్బున్నవారికే ప్రత్యేక హక్కా?**

ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో ఇద్దరు పిల్లలు చదువుకుంటే సంవత్సరానికి లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని దేవేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ట్యూషన్ ఫీజులు, అడ్మిషన్ ఫీజులు, ప్రత్యేక ఫీజులు, డెవలప్‌మెంట్ ఫీజులు, కంప్యూటర్ ఫీజులు, యాక్టివిటీ ఫీజులు, ట్రాన్స్‌పోర్ట్ ఫీజులు అంటూ పేర్లు మార్చి వసూళ్లు చేస్తున్నారని విమర్శించారు. "పిల్లల చదువు కోసం తల్లిదండ్రులు అప్పులు చేస్తున్నారు. బంగారం తాకట్టు పెడుతున్నారు.నెల జీతం మొత్తం స్కూల్ ఫీజులకే సరిపోతున్న పరిస్థితి ఏర్పడింది. ఇది విద్యా వ్యవస్థనా? లేక దోపిడీ వ్యవస్థనా?" అని ప్రశ్నించారు.

**ఫీజుల పేరుతో బహిరంగ దోపిడీ**

ప్రభుత్వం నిర్ణయించిన స్పష్టమైన విధానాలు లేకపోవడంతో ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతున్నాయని శివవర్మ నాయక్ ఆరోపించారు. ఒకే పట్టణంలో ఉన్న రెండు స్కూళ్ల మధ్య లక్షల రూపాయల ఫీజు వ్యత్యాసం కనిపిస్తోందని తెలిపారు. ఫీజులు ఎందుకు పెంచుతున్నారో, ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తున్నారో తల్లిదండ్రులకు చెప్పే బాధ్యత కూడా యాజమాన్యాలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వ అధికారులు కూడా ఈ వ్యవహారంపై కఠినంగా వ్యవహరించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.

**పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగుల పేరుతో మరో దందా!.**

ప్రస్తుతం అనేక ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాంలు, షూస్, బ్యాగులు నిర్దిష్ట దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని ఒత్తిడి తీసుకొస్తున్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. మార్కెట్‌లో సగం ధరకు లభించే వస్తువులను కొనుగోలు చేసే అవకాశాన్ని తల్లిదండ్రుల నుంచి దూరం చేస్తున్నారని పేర్కొన్నాయి. కొన్ని విద్యాసంస్థలు వ్యాపార సంస్థలతో కుమ్మక్కై కమిషన్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యను సేవగా కాకుండా సంపాదన సాధనంగా మార్చడం అత్యంత దురదృష్టకరమన్నారు.

**ట్రాన్స్‌పోర్ట్ ఫీజుల పేరుతో జేబు ఖాళీ.**

స్కూల్ బస్సుల ఫీజులు కూడా సామాన్య ప్రజలకు భారంగా మారాయని దేవేందర్ అన్నారు. కొన్నిచోట్ల ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు ట్యూషన్ ఫీజులకు సమానంగా ఉండటం విచారకరమన్నారు. ఒక విద్యార్థిని ఇంటి నుంచి స్కూల్‌కు తీసుకెళ్లి తీసుకురావడానికి నెలకు వేల రూపాయలు వసూలు చేయడం దోపిడీ కాకపోతే మరేమిటని ప్రశ్నించారు. ఈ ఫీజులను ఎవరు నిర్ణయిస్తున్నారు? వాటిపై పర్యవేక్షణ ఎవరిది? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి.**

ప్రైవేట్ విద్యా రంగంలో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం వెంటనే ప్రత్యేక ఫీజు రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ప్రతి ప్రైవేట్ పాఠశాల తమ ఫీజుల వివరాలను బహిరంగంగా ప్రకటించే విధానం తీసుకురావాలని సూచించారు. పుస్తకాలు, యూనిఫాంలు, ట్రాన్స్‌పోర్ట్ పేరుతో జరుగుతున్న అదనపు వసూళ్లపై ప్రత్యేక దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యను వ్యాపారంగా మార్చిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**ఉద్యమాలకు సిద్ధం.**

ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైతే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్, డీఎస్ఎఫ్ఐ నాయకుడు గుగులోతు శివవర్మ నాయక్ హెచ్చరించారు. "విద్య అమ్మకానికి కాదు... విద్య ప్రతి విద్యార్థి హక్కు. పిల్లల భవిష్యత్తుతో వ్యాపారం చేసే వారిని ప్రజలు క్షమించరు. తెలంగాణలో విద్యా దోపిడీకి ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైంది" అని వారు స్పష్టం చేశారు.

## ధరల దెబ్బకు ప్రజల జీవనం అస్తవ్యస్తం

- **పెట్రోల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు వెంటనే తగ్గించాలి**
- **జూన్ 10న రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో భారీ ఆందోళన**
- **ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి : ఆందోజు రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల కారణంగా దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరిగిపోతూ సామాన్య ప్రజల జీవనాన్ని సంక్షోభంలోకి నెట్టాయని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలకు నిరసనగా ఈ నెల 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో భారీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సోమవారం మీడియా సమావేశంలో రవీంద్ర చారి మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, వంటనూనెలు, పప్పులు, ఉప్పు తదితర నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని విమర్శించారు. దీంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడిందన్నారు. ఒకవైపు ప్రజల ఆదాయాలు పెరగకపోగా, మరోవైపు ధరలు మాత్రం ఆకాశాన్ని తాకడంతో పేదలు జీవనం సాగించడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలకు కోట్లాది రూపాయల రుణమాఫీలు, రాయితీలు కల్పిస్తూ, అదే భారాన్ని పరోక్షంగా ప్రజలపై మోపుతున్నారని ఆరోపించారు. దేశ సంపద కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, అంబానీ, ఆదానీ వంటి పెద్ద పారిశ్రామిక వేత్తల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు పెరిగి, దాని ప్రభావం అన్ని నిత్యావసర వస్తువులపై పడుతోందన్నారు. ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల జేబులు ఖాళీ అవుతున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదు. ధరల భారం నుంచి సామాన్యుడికి ఉపశమనం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి అని వారు పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌పై పన్నులను తగ్గించాలని, సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేస్తూ జూన్ 10న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ఆందోళన కార్యక్రమంలో రైతులు, కార్మికులు, మహిళలు, యువత, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహా మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ధరల పెరుగుదలపై ప్రజా ఆగ్రహానికి ప్రతీకగా నిర్వహించనున్న ఈ ఆందోళన కార్యక్రమం జిల్లాలో ప్రాధాన్యత సంతరించుకుంది.

## వ్యవసాయాభివృద్ధికి నర్మదా క్రాప్ కేర్ కట్టుబాటు

- **రైతుల సంక్షేమమే సంస్థ లక్ష్యం చైర్మన్ తిప్పా రెడ్డి**

**మొయినాబాద్, విశాలభారతి:** వ్యవసాయ రంగ అభివృద్ధికి నాణ్యత, విశ్వసనీయత, నవీనతను ప్రాతిపదికగా చేసుకుని నర్మదా క్రాప్ కేర్ సంస్థ పనిచేస్తోందని సంస్థ చైర్మన్ తిప్పా రెడ్డి తెలిపారు. మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్ గ్రామ రెవెన్యూ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సంస్థ లక్ష్యాలు, సేవల గురించి వివరించారు.ఈ సందర్భంగా తిప్పా రెడ్డి మాట్లాడుతూ, సంస్థ ఆవిర్భావం నుంచి రైతులకు నాణ్యమైన అగ్రో కెమికల్ ఉత్పత్తులను అందిస్తూ వ్యవసాయ ఉత్పాదకత పెంపునకు తోడ్పడుతున్నామని అన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.సంస్థ విజయాల్లో ఉద్యోగుల అంకితభావంతో పాటు వినియోగదారులు చూపుతున్న విశ్వాసమే ప్రధాన బలమని పేర్కొన్నారు. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించడమే తమ ధ్యేయమని చెప్పారు. వ్యవసాయ రసాయనాల రంగంలో అగ్రగామి సంస్థగా ఎదగడమే కాకుండా, రైతులతో దీర్ఘకాలిక అనుబంధాన్ని కొనసాగిస్తూ బాధ్యతాయుత వ్యవసాయ విధానాలను ప్రోత్సహిస్తామని తెలిపారు. వ్యాపార వృద్ధితో పాటు రైతుల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన విజయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి తమ వంతు సహకారం నిరంతరం అందిస్తామని స్పష్టం చేసిన తిప్పా రెడ్డి, సంస్థ అభివృద్ధికి సహకరిస్తున్న వినియోగదారులు, వ్యాపార భాగస్వాములు, శ్రేయోభిలాషులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజినెస్ హెడ్ సుగప్ప, డెవలప్‌మెంట్ హెడ్ కృష్ణ, జనరల్ మేనేజర్ సుదర్శన్ రెడ్డి, ప్రమోషనల్ హెడ్ ఎం. దినేష్‌కుమార్ రెడ్డి, ఏరియా సేల్స్ మేనేజర్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీ ఈటెల రాజేందర్‌కు అభినందనలు

**రెండేళ్ల సేవలతో ప్రజల మన్ననలు పొందిన ప్రజాప్రతినిధి : గంగాని శ్రీనివాస్**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడిగా రెండేళ్ల సేవలను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈటల రాజేందర్ కు హయత్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గంగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎంపీ ఈటెల రాజేందర్ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటూ, మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలను ప్రస్తావించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ పథకాలను నియోజకవర్గానికి తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం వల్ల ఈటెల రాజేందర్ ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, యువత ఉపాధి అవకాశాలు, సామాజిక సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆయన చూపుతున్న చొరవ ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ బీజేపీ డివిజన్ అధ్యక్షులు కూడా ఎంపీ ఈటెల రాజేందర్ రెండేళ్ల సేవలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ ఈటెల రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎల్ బి నగర్ నియోజకవర్గంలోని డివిజన్ల అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్,రాజేష్ కుమార్,ప్రకాష్,రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సేవా పథకం అవార్డు అందుకున్న సీఐ

**మర్యాదపూర్వకంగా కలిసిన జెర్కోని రాజు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సేవా పథకం అవార్డు అందుకున్న సందర్భంగా సామాజిక కార్యకర్త జెర్కోని రాజు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు .ఈ సందర్భంగా జెర్కోని రాజు మాట్లాడుతూ.. పోలీసు శాఖలో ప్రజలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా సీఐ మహేందర్ రెడ్డికి రాష్ట్ర స్థాయి అవార్డు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన చూపుతున్న అంకితభావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అవార్డు అందుకున్న మహేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రజాసేవలో ముందుండి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రవి, దయాచారి, మహేష్, ప్రభు, జలంధర్, (చిన్న) విజయ్, వికాస్, సాయి తదితరులు పాల్గొని సీఐ మహేందర్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

## కాశీంబౌలిలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభం



**మొయినాబాద్, విశాలభారతి:** శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్ ఆధ్వర్యంలో కాశీంబౌలి గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఈ నెల 8 నుండి 11 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామాభివృద్ధి, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ మరియు సామాజిక సేవా కార్యక్రమాల లక్ష్యంగా కళాశాల తుది సంవత్సరం విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్, రాజేందర్ రెడ్డి,ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, రైతులు మరియు గ్రామ ప్రజలు హాజరై శిబిరాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి డా. సి.ఎన్.ఆర్. సంతోషిణి మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంపొందించే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# ప్రజావాణిలో 170 వినతులు

- ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం:
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్ విశాల భారతి:**

ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించడం ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యమని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలను స్వీకరించి వారి సమస్యలను ఓపికగా విన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజల పట్ల అధికారులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. అందిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కార మార్గాలను చూపాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు కె. అనిల్ కుమార్ మరియు పురుషోత్తం పర్యవేక్షణలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను వర్గీకరించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 170 దరఖాస్తులు అందాయి. వీటిలో వ్యక్తిగత సమస్యలు, భూ వివాదాలు, సంక్షేమ పథకాల లబ్ధి, సాగునీటి సమస్యలు, గృహాల మంజూరు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన వినతులు ప్రధానంగా ఉన్నాయి.



**ఆసుపత్రి బాత్‌రూమ్‌ల సమస్యపై ఫిర్యాదు.**

మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో బాత్‌రూమ్‌లకు తాళాలు వేయడం వల్ల రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు అందింది. దీంతో ఆసుపత్రి పరిసరాల్లో అపరిశుభ్ర పరిస్థితులు నెలకొంటున్నాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఒంటరి మహిళా పింఛన్ కోసం వేడుకోలు.**

కేసముద్రం మండలం వెంకటాపురానికి చెందిన యాసారపు శిరీష తన భర్త విడిచిపెట్టి వెళ్లిపోవడంతో ఇద్దరు పిల్లలతో జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేస్తూ, తనకు ఒంటరి మహిళా పింఛన్ మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

**సాగునీటి కాలువ పునరుద్ధరణకు వినతి.**

తాళ్లపూసపల్లి నుంచి చెముల్లాపూర్ వరకు ఉన్న ప్రధాన సాగునీటి కాలువ పూడికకు గురైందని, రైతులకు నీరు అందడం లేదని గడిశల వెంకన్న ఫిర్యాదు చేశారు. కాలువను సర్వే చేసి పునరుద్ధరించాలని కోరారు.

**ఇందిరమ్మ ఇంటి కోసం విజ్ఞప్తి.**

గూడూరు మండలం బంచరాయితండాకు చెందిన బి. మాధవి తాము పెంకుటింట్లో నివసిస్తున్నామని, వర్షాకాలంలో ఇల్లు కూలిపోయే పరిస్థితి ఉందని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసినప్పటికీ ఇల్లు మంజూరు కాలేదని, ప్రస్తుత రెండో విడతలో అయినా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**భూ సమస్యపై న్యాయం చేయాలని అభ్యర్థన.**

మహబూబాబాద్ మండలం ఈదులపూసపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్లు 102, 103లకు సంబంధించిన భూమి సమస్యపై ఎస్.కె. ఖాసిం సాహెబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి తగిన విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజల అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు. పారదర్శక పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలోని ఉద్యోగులందరూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం పొందాలని సూచించారు. అలాగే వచ్చే వారం పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పాఠశాలలు, వసతి గృహాలను తనిఖీ చేసి విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో మక్కజొన్న, వరి ధాన్యం ఉత్పత్తి కావడంతో వాటి సేకరణ, తరలింపులో సమర్థవంతంగా పనిచేసిన అధికారులను కలెక్టర్ అభినందించారు. ప్రజావాణి కార్యక్రమంలో జడ్పీ సీఈవో, డీఆర్‌డీఓ ప్రాజెక్టు డైరెక్టర్, డీసీఓ, కలెక్టరేట్ పరిపాలన అధికారి సహా వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## బలిజగూడలో ఘనంగా గ్రామసభ నిర్వహణ

**గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరం : సర్పంచ్ ఉప్పు మాధవి నవీన్ కుమార్**




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడ గ్రామంలో సోమవారం సర్పంచ్ ఉప్పు మాధవి నవీన్ కుమార్ అధ్యక్షతన గ్రామసభ ఘనంగా నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై గ్రామసభలో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో వాణి హాజరై గ్రామాభివృద్ధి పనుల అమలు, ప్రభుత్వ పథకాల సద్వినియోగం, ప్రజల భాగస్వామ్యంపై పలు సూచనలు చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. అలాగే ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖలకు చెందిన అధికారులు, మహిళా మండలి సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సేవల గురించి గ్రామస్తులకు వివరించారు. గ్రామంలో ఉన్న సమస్యలు, అభివృద్ధి పనులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల నిర్మాణం తదితర అంశాలపై గ్రామస్తులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. సర్పంచ్ ఉప్పు మాధవి నవీన్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కోసం ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామసభకు హాజరై సూచనలు చేసిన గ్రామస్తులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గ్రామసభ సానుకూల చర్చలతో, అభివృద్ధి లక్ష్యాలపై స్పష్టమైన కార్యాచరణతో విజయవంతంగా ముగిసింది. గ్రామసభలో ఉప సర్పంచ్ ఉప్పు నరేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కిషన్ నాయక్, మాజీ సర్పంచ్ బుర్ర వీరాస్వామి, వార్డు సభ్యులు బుర్ర రాణి రమేష్, ఈరిగి లావణ్య చిరంజీవి, ఉప్పు నిర్మల శ్రీకాంత్, ఉప్పు జ్ఞానేశ్వర్, బుర్ర మహేష్, మేడి చంద్రకళ జ్ఞానేశ్వర్, మేడి దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలని

**ఆఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా**

**భద్రాద్రి ప్రతినిధి :విశాలభారతి :** పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఐక్య రైతు సంఘం ఇల్లందు ఎక్స్ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య ఐక్య రైతు సంఘం రాష్ట్ర సహకార దర్శి ముద్దా బిక్షం ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు.జాతీయ కమిటీ పిలుపులో భాగంలో. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు,విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని, పాత రుణాలు రద్దు చేసి కొత్త రుణాలు ఇవ్వాలని, యూరియా యాప్ ను తొలగించాలని, రైతులకు సరిపోయే మొత్తం ఎరువులు అందించాలని కేంద్ర ప్రభుత్వం సోమనాథ్ కమిషన్ నివేద ప్రకారం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని.డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్న అనంతరం జిల్లా కలెక్టర్ కి రైతు సమస్యలతో కూడిన మెమొరండాన్ని ఐక్య రైతు సంఘం జిల్లా ప్రతినిధి బృందం అందజేయడం జరిగింది

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గుమ్మడి నరసయ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ముద్ద భిక్షం మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాడని రైతుల పట్ల తనకు సవతి తల్లి ప్రేమ ఉందని ఆరు కాలం కష్టపడి పండించిన రైతుల పంటలను సకాలంలో మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయలేదని వారు మండిపడ్డారు దేశంలో రైతులు అనేక సమస్యలతో సతమతమవుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న సందర్భంగా రైతులకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలను సమకూర్చటంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని వారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు నాణ్యమైన ఉచిత విత్తనాలు సప్లై చేయాలని వారన్నారు రాష్ట్రంలో కల్తీ విత్తనాల అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయని దీనివల్ల రైతులకు దిగుబడి రాక అప్పుల పాలయి ఆత్మహత్యలకు పరంపర కొనసాగుతున్నాయని వారు తెలియజేశారు .దళారీ వ్యవస్థ ద్వారా అమ్మకాలు జరుగుతున్న సమదిత అధికారులు పర్యవేక్షణ లోపించి రైతులకు అన్యాయం జరుగుతుందని వారు తెలియజేశారు. రైతులు పాత రుణాలు మాఫీ చేసి ఖరీఫ్ సీజన్లో రైతులు వ్యవసాయానికి సహాయం కొరకు కొత్త రుణాలు అందజేయాలని రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు సగం సబ్సిడీపై అందజేయాలని వారన్నారు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పెంచిన కాంప్లెక్స్ ఎరువుల ధరలను తక్షణమే రద్దు చేయాలని రైతులకు సరిపడా ఎరువులను అందించాలని వీరియాకు ఆన్లైన్ యాప్ ఎత్తివేయాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బుర్ర ఎంకన్న, కంగాల కల్లయ్య, జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మ, జిల్లా నాయకులు ఈసం శంకర్, గొగ్గల వెంకటేశ్వర్లు,శ్రీరామ్ కోటయ్య బైరు వెంకన్న, జూకంటి గాంధీ సింగన్న కంగాల కన్నయ్య బుచ్చిరాజు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు నాయని రాజు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోదనపల్లి ప్రభాకర్ జాటోతు కృష్ణ రాజశేఖర్తదితర నాయకులు పాల్గొన్నారు.



## కాలువలు మూసివేత ఇళ్లలోకి చేరిన నీరు

- అవస్థల్లో ఇటుకలగడ్డ తండా ప్రజలు
- చిన్నారులకు తప్పని కష్టాలు, వ్యాధుల భయం

**మరిపెడ, విశాలభారతి:**

డోర్నకల్ నియోజకవర్గంలోని మరిపెడ మండలం, ఎలమంచిలి తండా గ్రామపంచాయతీ పరిధిలోని ఇటుకలగడ్డ తండా ప్రస్తుతం తీవ్ర పారిశుద్ధ్య సమస్యతో సతమతమవుతోంది. గ్రామంలోని మురికి కాలువలు మూసుకుపోవడం, కొన్ని చోట్ల పూర్తిగా పూడుకుపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక నేరుగా ఇళ్లలోకి చేరుతోంది. దీంతో తండా ప్రజల జీవనం దుర్భరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి కారణంగా నీటి ప్రవాహం నిలిచిపోయింది. ఫలితంగా మురికి నీరు వీధుల్లో నిలిచి చివరకు ఇళ్లలోకి చేరింది. అనేక కుటుంబాలు తమ ఇళ్లలోనే నీటిని తోడుకుంటూ గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంటి ఆవరణలు, వంటగదులు, పడక గదుల్లోకి సైతం నీరు చేరడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



**నీటిలోనే చిన్నారుల జీవనం**

ఈ పరిస్థితుల్లో అత్యంత ఇబ్బందులు పడుతున్నది చిన్నారులే. ఇంటి బయటకు వెళ్లలేని పరిస్థితి, ఇంట్లోనే మురికి నీరు నిల్వ ఉండటంతో పిల్లలు అదే నీటిలో తిరగాల్సి వస్తోంది. దీంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులకు చర్మవ్యాధులు, జ్వరాలు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు.

**దుర్వాసనతో నరకయాతన**

కాలువల్లో నిలిచిపోయిన మురికి నీటి నుంచి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. సాయంత్రం వేళల్లో దోమల బెడద మరింత పెరిగి ప్రజలు నిద్రపట్టని పరిస్థితి నెలకొంది. ఇంటి తలుపులు తెరవాలన్నా, బయట కూర్చోవాలన్నా దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు.

**ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యమా?**

గ్రామంలో ఈ సమస్య కొత్తది కాదని స్థానికులు చెబుతున్నారు. కాలువల నిర్మాణం సక్రమంగా లేకపోవడం, ఉన్న కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వర్షం పడితే భయపడుతున్న ప్రజలు**

మరోసారి భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఇళ్లలోకి చేరిన నీటితో విలువైన గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు దెబ్బతిన్నాయని బాధితులు చెబుతున్నారు.

**తక్షణ చర్యలు తీసుకోవాలి**

ఇటుకలగడ్డ తండాలో నెలకొన్న సమస్యను జిల్లా అధికారులు, పంచాయతీ అధికారులు అత్యవసరంగా పరిశీలించి కాలువలను శుభ్రపరచడంతో పాటు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. మురికి నీరు పూర్తిగా తొలగించి, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## విద్యార్థుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలి




**హయత్‌నగర్‌లో సోషల్ జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థి రక్షణ దీక్ష**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

హయత్‌నగర్ మండల కార్యాలయం సమీపంలో సోషల్ జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థి రక్షణ దీక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం చామకూర రాజు, కె.వి. గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య , మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. 2008లో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరాహార దీక్షకు అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేశారని గుర్తు చేశారు. అనంతర కాలంలో పలు ప్రభుత్వాలు ఆ పథకాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నించినప్పటికీ, విద్యార్థి సంఘాలు మరియు సామాజిక సంస్థల పోరాటాల వల్ల వాటికి అడ్డుకట్ట పడిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో అధిక సంఖ్యలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుతున్నారని, వారికి నాణ్యమైన విద్యతో పాటు తగిన మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని నియంత్రించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుల కోసం ప్రభుత్వం తక్షణమే రూ.10 వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగరావు మాట్లాడుతూ.. విద్యను వ్యాపారంగా మార్చి కొందరు కార్పొరేట్ విద్యాసంస్థలు వేల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు విద్యా రంగం నిధుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, మరోవైపు ఇతర ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించడం సమంజసం కాదన్నారు. విద్యా రంగానికి మరింత ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పన వంటి డిమాండ్లతో ఈ కార్యక్రమం సాగింది. ఈ దీక్ష కార్యక్రమంలో బాలరాజ్, ఎల్లయ్య, శ్రీనివాసు, పెద్దవూర బ్రహ్మయ్య, సాయి, నక్క మహేష్, సాయి ముదిరాజ్, వేణు, కాచం సత్యనారాయణ, బైరు శేఖర్ తదితరులు పాల్గొని విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ముగిసిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' గ్రామ సభ

**ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరు**




**రాజేంద్రనగర్, విశాలభారతి:** శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామ పంచాయతీ పరిధిలో గత కొన్ని రోజులుగా ఉత్సాహంగా కొనసాగిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" (99 రోజుల కార్యాచరణ కార్యక్రమం) ముగింపు గ్రామ సభ సోమవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామ సభలో ప్రజల సమస్యలను ఎమ్మెల్యే ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల నుంచి పలు వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్య మెరుగుదల, ప్రజా సమస్యల త్వరిత పరిష్కారం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పాలమాకుల గ్రామ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చలు జరగగా, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నిర్ణయించారు. గ్రామంలో చేపట్టాల్సిన భవిష్యత్ కార్యక్రమాలపై కూడా ప్రణాళికలు రూపొందించారు.

## నీతి నిజాయితీ సిద్ధాంతాలకు నిదర్శనం కిషన్ రెడ్డి

**మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**



**సికింద్రాబాద్, విశాలభారతి :** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ని తెలంగాణ పొలిమేరలు దాటనివ్వనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్న మాటలను ఖండిస్తూ, తెలంగాణ గడ్డపై కిషన్ రెడ్డిని ఆపే శక్తి ఎవరికీ లేదని కిషన్ రెడ్డి అంటే తెలంగాణ ప్రజలకు బాగా తెలుసునని మీ బెదిరింపులకు భయపడే వ్యక్తి కిషన్ రెడ్డి కాదని బౌద్ధ నగర్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ అన్నారు .పన్నెండు పార్టీలు తిరిగి బీజేపీ లోకి వచ్చిన వ్యక్తి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాదని, బీజేపీలోనే పుట్టి, పార్టీలోనే రాజకీయ జీవితాన్ని ప్రారంభించాడని తెలంగాణ రాష్ట్రం కోసం కిషన్ రెడ్డి చేసిన పనులకు రేవంత్ రెడ్డి కితాబు ఇవ్వాల్సిన అవసరం లేదని . కేంద్ర మంత్రిగా తెలంగాణ కోసం తీసుకొచ్చిన ప్రాజెక్టులు, నిధులు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు బాగా తెలుసునని దేశంలోనే కేంద్ర మంత్రిగా ఆయన చేసిన పనులకు మంత్రులలో మొదటి స్థానం కిషన్ రెడ్డికి లభించిందని మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ అన్నారు.

## అప్రెంటిస్ మేళా విజయవంతం




**విశాలభారతి, మణుగూరు :** మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో సోమవారం నిర్వహించిన నేషనల్ అప్రెంటిస్ మేళా విజయవంతమైనట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ డి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ లో భాగంగా నిర్వహిస్తున్న నేషనల్ అప్రెంటిస్ మేళాలో భాగంగా మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో నిర్వహించిన అప్రెంటిస్ మేళాకు హైదరాబాద్ కు చెందిన వి ఎల్ ఆర్ ఫెసిలిటేటర్స్, శక్తి హార్మోన్స్, వోహిత్ టర్బోలు, విజయవాడకు చెందిన ఎల్ అండ్ టి కంపెనీ అమరావతి,వి ఎం బంజర కు చెందిన తాళ్లూరి టెక్స్టైల్స్, భద్రాచలం కు చెందిన ప్రథమ ఐటిసి, మణుగూరు కు చెందిన చాతురియ ఇంజనీరింగ్ వర్క్స్ ఏపీపై ఇంజనీరింగ్ అండ్ కన్స్ట్రక్షన్స్ కంపెనీలు హాజరు కావడం జరిగింది అన్నారు. అదేవిధంగా ఈ అప్రెంటిస్ మేళాకు సుమారు సుమారు వందమంది వరకు హాజరు కావడం జరిగిందాన్నారు. హాజరైనవారిలో 34 మందిని ఆ కంపెనీలో ప్రతినిధులు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపికైన వారిని నేరుగా కంపెనీలకు హాజరు కావాలని తెలిపారు. ఈరోజు హాజరు కాలేని వారు కూడా నేరుగా ఐటిఐ కి వచ్చినట్లయితే ఆ కంపెనీలకు పంపించడం జరుగుతుందన్నారు. కావున ఐటీఐ పూర్తి చేసిన వారు అప్రెంటిస్ కోసం ఎప్పుడైనా మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో సంప్రదించవచ్చని తెలిపారు. ఐటిఐ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు అప్రెంటిస్ చేయాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ప్రభుత్వం ఐటిఐ ట్రైనింగ్ ఆఫీసర్ జి రవి, సూపరింటెండెంట్ జ్యోతిరాణి, సీనియర్ అసిస్టెంట్ సాధన, ఏటీవోలు జీవీ కృష్ణారావు, ఎం శ్రీనివాసరావు, ఏ నరసయ్య, వేణుగోపాల్ నాయుడు, డి మహేష్, కొమరం ధర్మయ్య, ఏటిసి మాస్టర్ ట్రైనర్ పూర్ణచందర్రావు, ఐటిఐ ఏటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## మణుగూరు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యం.. ప్రజల బతుకులు బురదలో వాగులు చెత్తతో ఫుల్,
- వర్షం వస్తే రోడ్లే చెరువులు, ఆందోళనలో ప్రజలు





**విశాలభారతి, మణుగూరు :** పురపాలక కమిషనర్ నిర్లక్ష్యం వల్ల వర్షాకాలం రాకముందే ఆ ప్రాంతం నరకంగా మారుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాగులన్నీ చెత్త డంపింగ్ యార్డులుగా దర్శనమిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఎన్నిసార్లు చెప్పినా కమిషనర్ చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కట్టే వాగు, మిట్ట వాగు, కోడిపుంజుల వాగు మొత్తం చెత్త చెదారాలతో కిక్కిరిసిపోయాయి. ఒక్క వాన పడితే చాలు, నీరంతా రోడ్లపైకి వచ్చి ఇళ్లలోకి చొరబడుతుందని ప్రజలు భయపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో సుందరయ్య నగర్ వాసులు ఇళ్లకు తాళాలు వేసి కిరాయికి వెళ్తున్నారు. మా సొంత ఇళ్లు ఉన్నా బతకలేని పరిస్థితి. ప్రతి వానకాలం ఇదే గోస అని ఓ మహిళ కన్నీటి పర్యంతమయ్యారు. మేధావులు, పట్టణ ప్రజలు సమావేశమై కమిషనర్ నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు. ప్రజలు ఇప్పటికే జిల్లా కలెక్టర్ అంకిత్, స్థానిక ఎమ్మెల్యే, కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు. సోమవారం జరగనున్న ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ఏం చర్యలు తీసుకుంటారోనని మణుగూరు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రజల పన్నుల డబ్బుతో జీతాలు తీసుకునే అధికారులు ప్రజల కనీస సమస్యలు కూడా పరిష్కరించలేకపోతే ఎందుకు..?అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## భద్రాచలంలో హోటల్ల దందా



**భద్రాచలం, విశాలభారతి;** భద్రాచలం పలు హోటలలో భక్తులపై అధిక రేట్ల తో ఆహార పదార్థాలను అమ్ముతూ అదనపు భారం మోపుతూ భద్రాచలం లో హోటల్ దందా కొనసాగిస్తున్నారని సామాన్య భక్తులకు పేనుబారంగా మారుతుందని మహాజన సమితి మండల అధ్యక్షులు చింత ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు అవసరాలను ఆసరగా చేసుకొని టిఫిన్లు భోజనాల ధరలను ఇష్టానుసారంగా పెంచుతూ జేబులకు చిల్లి పెడుతున్నారని హోటల్లో బిల్లుపై మొత్తం పై అదనంగా 10 శాతం వసూళ్లు చేస్తుండటం తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఆక్రమ వాసుల్లను అరికట్టాలని ఆయన కోరారు.

## పచ్చదనమే లక్ష్యంగా ముందుకు అడుగులు

**విశాలభారతి :** కరకగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని మోత గ్రామ నర్సరీ వద్ద ప్రత్యేక శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టిన సర్పంచ్ పోలేబోయిన సుజాత గారు మరియు ఉప సర్పంచ్ బుడగం రాము. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ పాల్గొని పర్యవేక్షించి మాట్లాడుతూ, గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనం పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. నర్సరీలను సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందించవచ్చని తెలిపారు.గ్రామాభివృద్ధి, పరిశుభ్రత మరియు పచ్చదనం పెంపుదల లక్ష్యంగా గ్రామపంచాయతీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# నా కెరీర్‌లోనే రామాయణ ప్రత్యేకం

ప్రస్తుతం దేశంలో రూపొందుతున్న భారీ చిత్రాల్లో అత్యంత భారీ సినిమా ఏది? అనంటే ఠక్కుమని వచ్చే సమాధానం 'రామాయణ'. నితేశ్ తివారీ దర్శకత్వంలో ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ పతాకంపై దాదాపు మూడువేల కోట్ల భారీ నిర్మాణ వ్యయంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణబీర్‌కపూర్, సీతగా సాయిపల్లవి నటిస్తున్న విషయం తెలిసిందే. రావణ పాత్రలో కన్నడ స్టార్ యశ్ నటిస్తుండగా, రావణుడి భార్య మండోదరి పాత్రను కాజల్ అగర్వాల్ పోషిస్తున్నట్టు ఇన్నాళ్లూ వార్తలొచ్చాయి. తాజాగా ఈ విషయాన్ని కాజల్ కూడా ధృవీకరించింది. ఓ అవార్డు వేడుకకు హాజరైన కాజల్ 'రామాయణ' గురించి మాట్లాడుతూ "రామాయణ'లో మండోదరిగా నటిస్తున్నాను. నా కెరీర్లో ఇలాంటి బిగ్ ప్రాజెక్ట్ చేయడం ఇదే ప్రథమం. అందరిలాగే ఈ సినిమా కోసం నేనూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అన్నారు కాజల్. రెండు భాగాలుగా ఈ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. తొలిభాగం ఈ ఏడాది దీపావళికి విడుదల కానుండగా, రెండో భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి విడుదల చేయనున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.